



## ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యం వద్దు: జేసీ



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న జేసీ

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజలు ఇచ్చిన ఫిర్యాదుల విషయంలో నిర్లక్ష్యం వహించరాదని అధికారులను జాయింట్ కలెక్టర్ (జేసీ) శివనారాయణశర్మ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. 502 మంది తమ సమస్యలను పరిష్కరించాలని వినతులు ఇచ్చుకున్నారు. అనంతరం అధికారులతో జేసీ సమీక్ష నిర్వహించారు. ప్రతి ఫిర్యాదును సకాలంలో పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో మలోల, డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, మల్లికార్జున, ఆనంద్ పాల్గొన్నారు.

## ఒక్కరే..!



ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

ప్రజా ఫిర్యాదుల పరిష్కా ర వేదికను మండల స్థా యి అధికారులు తేలిగ్గా తీసుకుంటున్నారు. ఒకరిద్దరు మినహా హాజరు కా వడం లేదు. స్థానికంగానే సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలని, జిల్లా కేంద్రానికి తాకిడి తగ్గించాలని కలెక్టర్ సహా ఉన్నతాధికారులు పలుమార్లు సూచించినా మార్పు కనిపించడం లేదు. దీంతో ప్రతి చిన్న సమస్యకూ ప్రజలు జిల్లా కేంద్రానికి వస్తున్నారు. కుందుర్పి తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు తహసీల్దారు శ్రీనివాసు లు, బొమ్మనహాళ్‌లో త హసీల్దారు మునివేలు మాత్రమే హాజరయ్యారు. సుమారు 21 శాఖల అధికారులు గ్రీవెన్స్‌లో అందుబాటులో ఉండాలి. ఫోన్ చేసి చెప్పినా గైర్హాజరు అవుతున్నారని తహసీల్దార్లు వాపోతున్నారు.





సమస్యలు వింటున్న తహసీల్దార్ మునివేలు

- ఆంధ్రజ్యోతి, కుందుర్పి, బొమ్మనహాళ్

రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెలరేగిపోతున్నారు. నాయకుల అండతో ఇష్టారాజ్యంగా వెంచర్లు వేస్తున్నారు. లే అవుట్లకు కనీస అనుమతులు లేకపోయినా అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఇటీవల పామిడి పట్టణంతో పాటు చుట్టూ లే అవుట్లు భారీగా వెలిశాయి. వీటిలో ఎక్కడా నిబంధనలు పాటించిన దాఖలాలు లేవు. అనుమతులు లేని లేఅవుట్లలో కొనుగోలు చేస్తే భవిష్యత్‌లో మూల్యం చెల్లించక తప్పదని అధికారులే ఉచిత సలహాలు ఇస్తున్నారు.

# రియల్టర్ల ఇష్టారాజ్యం..!

## పంట పొలాల్లో అక్రమ వెంచర్లు

- కన్వర్షన్ లేకుండానే ప్లాట్లు
- రూ.కోట్లలో ప్రభుత్వ ఆదాయానికి గండి
- మోసపోతున్న కొనుగోలుదారులు
- నేతల ప్రమేయం.. కన్నెత్తిచూడని యంత్రాంగం



నెమళ్లపల్లి వద్ద వేసిన అక్రమ లే అవుట్

పామిడి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపిరి పోసుకుంది. పామిడి పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో రియల్ దందా జోరుగా సాగుతోంది. అక్రమ వెంచర్లు రియల్టర్లకు కాసులు కురిపిస్తున్నాయి. రాజకీయ నేతల ప్రమేయంతో అధికారులు వీటివైపు కన్నెత్తి చూడలేదు. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ రియల్టర్లు దోచుకుంటున్నారు. జిల్లా కేంద్రమైన అనంతపురం నగరానికి పామిడి 30 కిలోమీటర్లలోనే ఉండడం, వస్త్ర వ్యాపారంతో అంచెలంచెలుగా ఎదగడంతో పామిడిలో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. పట్టణానికి అనుబంధంగా 44వ జాతీయ రహదారికి ఇరువైపులా కిలోమీటర్ల పొడవునా లే అవుట్లు వెలుస్తున్నాయి. స్థానిక కొండూరు రోడ్డు, ఎద్దులపల్లి రోడ్డు, నెమళ్లపల్లి, పి.కొండాపురం, కాళాపురం, దేవరపల్లి, నీలూరు, పొగరూరు, రామరాజుపల్లి, ఎద్దులపల్లి, రామగిరి గ్రామాల్లో సైతం వెంచర్లు వేశారు. కొన్ని లే అవుట్లకు వైసీపీ, కూటమి నాయకుల అండదండలు పుష్కలంగా ఉండడంతో అధికారులు కన్నెత్తి చూడడం లేదు. మరికొన్ని లే అవుట్లకు ముడుపుల తీసుకుని అధికారులు మిన్నకుండిపోతున్నట్లు తెలుస్తోంది. వంక పోరంబోకు స్థలాలను సైతం ఆక్రమించి వెంచర్లలోకి కలిపేస్తున్నారు.

### నిబంధనలకు నీళ్లు

పామిడి పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో వేసిన వెంచర్లలో దాదాపు 90 శాతం పైగా లే అవుట్లలో రిజర్వు సైట్లు లేవు. లే అవుట్ వేసే భూమిని వ్యవసాయేతర భూమిగా కన్వర్షన్ చేసుకోవాలి. దీనికి పలు రకాల పన్నులు చెల్లించాలి. ఇవేవీ చెల్లించకుండానే లే అవుట్లు వేసి ప్లాట్లు అమ్మేస్తున్నారు. నిబంధనల ప్రకారం వెంచర్‌లో 10 శాతం స్థలాన్ని సామాజిక, ప్రజా అవసరాలకు వదలాలి. రోడ్లు, విద్యుత్ స్తంభాలు, మురుగునీటి కాలువలు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు స్థలం చూపాలి. లే అవుట్‌లోకి వెళ్లేందుకు 45 అడుగుల వెడల్పుతో ప్రధాన రహదారి, అంతర్గత రోడ్లు కనీసం 33 అడుగుల వెడల్పుతో వేయాలి. మండలంలో ఇవేవీ అమలు కావడం లేదు. రియల్టర్లు సెంటు స్థలం కూడా వదలడం లేదు. అప్రూవల్ లేని లే అవుట్లలో ప్లాట్లు కొని ఇళ్లు కట్టుకొనేవారు ఇబ్బందులకు గురికాకతప్పదని ప్రకటనలతో అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. భవిష్యత్‌లో ఇలాంటి వాటిపై రెవెన్యూ అధికారులు భారీగా జరిమానాలు విధించవచ్చు. ఇదే జరిగితే కొనుగోలుదారులే ఎక్కువగా నష్టపోతారు. ప్లాట్లు కొనుగోలు చేసేటప్పుడు లే అవుట్ అప్రూవల్ ఉందా.. లేదా..? అని తెలుసుకోవడం చాలా ముఖ్యమని అధికారులు ఉచిత సలహాలు ఇస్తున్నారు.



ఎద్దుపల్లి రోడ్డులో కాలువను కాజేసి వేసిన వెంచర్

### ప్రభుత్వానికి రూ. కోట్లలో గండి

పెరిగిన భూముల ధరలకు తగ్గట్టుగా ఫీజుల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం చేకూరడం లేదు. ప్రభుత్వానికి రూ. కోట్లలో ఆదాయం గండి పడుతోంది. పామిడిలో ఎకరా భూమి రూ. 1 నుంచి 5 కోట్లకు పైగానే పలుకుతోంది. పట్టణంలోని 44వ జాతీయ రహదారికి ఇరువైపులా, కొండూరు రోడ్డు, ఎద్దులపల్లి రోడ్డు, కొండాపురం రోడ్డు, నెమళ్లపల్లి, దేవరపల్లి గ్రామాల సమీపాన వేసిన లే అవుట్లకు పూర్తి స్థాయిలో దేనికీ అనుమతులు లేవని అధికారులే చెబుతున్నారు.



### కన్వర్షన్ లేని వెంచర్లపై చర్యలు

కన్వర్షన్ లేని వెంచర్లపై చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వానికి అన్ని రకాల పన్నులు చెల్లించిన తర్వాతనే కన్వర్షన్‌కు నివేదికలు సమర్పిస్తాం. కన్వర్షన్ లేని వెంచర్లలో ఎలాంటి క్రయ విక్రయాలు జరగకుండా చట్టపరమైన చర్యలు చేపడతాం. ఇప్పటికే పలువురికి నోటీసులు జారీ చేశాం. రెవెన్యూ సమస్యలు ఉన్న భూముల్లో వెంచర్ వేసిన వారిపైనా చర్యలు తీసుకుంటాం.

-శ్రీధరమూర్తి, తహసీల్దార్, పామిడి

### అక్రమ లే అవుట్లను అరికడతాం

పామిడి పట్టణంతో పాటు మండల పరిధిలో వేసిన అక్రమ లే అవుట్లపై చర్యలు తీసుకుని అరికడతాం. పట్టణంలో కొన్ని వెంచర్లకు మాత్రమే పూర్తి స్థాయిలో అనుమతులు ఉన్నాయి. ఇప్పటికే పలుమార్లు అక్రమ లే అవుట్లలో కొనుగోలు చేయరాదని సూచించాం. రియల్టర్లకు నోటీసులు జారీ చేస్తాం. నిబంధనల ప్రకారం ఉంటేనే అనుమతులు మంజూరు చేస్తాం.

-రాజేంద్ర కృష్ణకుమార్, ఈఓఆర్‌డీ, పామిడి



# పారిశుధ్యంలో పురుగులు..!

- నడుం వంచకుండా మేస్త్రీల అజమాయిషీ
- నిబంధనలకు విరుద్ధంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీల నియామకం
- రూ.80 వేల జీతం.. పైసా పనిచేయని రెగ్యులర్ వర్కర్లు
- బదిలీ వర్కర్లతో ఇంట్లోనే కాలక్షేపం
- రోజూ పనికేరాని వారు 30 మందికిపైనే..
- నగరంలో పేరుకుపోయిన చెత్త



నాలుగో రోడ్డు మురుగు కాలువలో పేరుకుపోయిన చెత్త

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): నగరంలో పారిశుధ్యం ప్రధాన సమస్యగా మారింది. కార్పొరేషన్ నిధులలో సింహభాగం వెచ్చించేది దీనికోసమే అయినా.. పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదు. మురుగు నీరు కదలని కాలువలు, రోడ్డు పక్కన చెత్తదిబ్బలు, దోమల స్వైరవిహారం, పందుల సంచారం.. ఇదీ నగరంలో పరిస్థితి. దీనికి ప్రధాన కారణం పారిశుధ్య విభాగంలో పాతుకుపోయిన అవినీతి పరులు. కార్మికుల నుంచి అధికారుల వరకు చాలామంది నిబంధనలను పాటించడం లేదు. ముడుపులు ఇస్తే చాలు పనికి రాకపోయినా పట్టించుకునే వారు లేరు. కీలక పోస్టులను సైతం అనర్హులకు కట్టబెట్టేశారు. చెత్త ఊడ్చడం, డ్రైనేజీ కాలువలలో పూడికతీయడం తదితర పనులు చేసేవారికంటే.. పెత్తనం చేసేవారే ఎక్కువగా ఉన్నారు.

### కుక్క పిల్ల.. ఫర్నీచర్.. క్యాష్..

శానిటరీ ఇన్‌స్పెక్టర్లలో ఒకరు మినహా అందరూ నిబంధనలకు విరుద్ధంగా నియమితులైనవారే అని సమాచారం. ఆరు సర్కిళ్లకు ఆరుగురు రెగ్యులర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉండాలి. పారిశుధ్య విభాగంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్(ఎంహెచ్‌ఓ), శానిటరీ సెక్రటరీలు (సచివాలయ ఉద్యోగులు), ఆ తరువాత శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కీలకం. కానీ ఎంహెచ్‌ఓ, శానిటరీ సెక్రటరీల కంటే శానిటరీ ఇన్‌స్పెక్టర్ల హవానే నడుస్తోంది. ప్రస్తుతం ఐదో సర్కిల్‌కు ఉన్న ఆంజనేయులు ఒక్కరే రెగ్యులర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్. విజిలెన్స్ కేసును కొట్టివేయించుకుని వచ్చి ఈ పోస్టు తెచ్చుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పారిశుధ్య విభాగంలో ఓ అధికారికి కొందరు రూ.60వేలు ముడుపులు ఇచ్చారని ప్రచారం ఉంది. మరో ఉద్యోగి బొచ్చు కుక్కపిల్లను కానుకగా ఇచ్చి పోస్టు తెచ్చుకున్నారట. మరో ఇద్దరు ఫర్నిచర్ ఇచ్చినట్లు తెలిసింది. వారందరికీ సీనియారిటీ లేదు, సర్వీస్ లేదు. పర్మినెంట్ వర్కర్లుగా ఉండి డెప్యుటేషన్ మేస్త్రీలైన వారికి నిబంధనలకు విరుద్ధంగా ఆ పోస్టులు అప్పగించారు. నిర్దేశించిన పరీక్ష ఉత్తీర్ణులయ్యాకే ఆ పోస్టుకు అర్హులు. కానీ వీరంతా దొడ్డిదారిలో వచ్చిన వారే. 13 మంది మేస్త్రీలంతా ఔట్‌సోర్సింగ్ కార్మికులే. మేస్త్రీలుగా రెగ్యులర్ కార్మికులుండాలి. ఇక్కడా ముడుపుల వ్యవహారం నడిచినట్లు తెలుస్తోంది.

### మేడమ్ వచ్చాక...

ఆయన ఇదివరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. కాలం కలిసి వచ్చి మడకశిరకు కమిషనర్‌గా మారారు. అక్కడా ఆరోపణలు రావడంతో తిప్పి పంపారు. ఉద్యోగం ఇప్పిస్తానని ఒకరితో రూ.5లక్షలు దిగమింగాడనే ఆరోపణలు వచ్చాయి. ఈ విషయమై ఆయనపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు వెళ్లింది. రూ.2.50 లక్షల తిరిగి ఇవ్వడంతో ఫిర్యాదును వాపస్ తీసుకున్నారు. ఆరోపణల కారణంగా గతంలో కమిషనర్లు డంపింగ్‌యార్డు పర్యవేక్షణకే ఆయనను పరిమితం చేశారు. ప్రస్తుత పారిశుధ్య విభాగం అధికారితో కుమ్మక్కయ్యారు. ముడుపులిచ్చి శానిటరీ సూపర్‌వైజర్ పోస్టు తెచ్చుకున్నారు. సంతకం పెట్టేసి అలా బైక్‌లో నగరంలో తిరుగుతుంటాడనే విమర్శలు ఉన్నాయి. తాజాగా అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న నగరపాలికకు వచ్చాక కాస్త శ్రద్ధపెడుతున్నాడని సమాచారం.

### బదిలీ యవ్వారం బాగుందబ్బా...

పారిశుధ్య విభాగంలో రెగ్యులర్ కార్మికులు 135 మంది, ఔట్‌సోర్సింగ్ 409, అదనపు కార్మికుల కింద (మలేరియా, కొవిడ్, గార్బేజ్ కార్మికులు) 131 మంది ఉన్నారు. మొత్తం 675 మంది పనిచేస్తున్నారు. వీరిలో రెగ్యులర్ కార్మికులకు రూ.60వేల నుంచి రూ.80వేల జీతం పుచ్చుకునే వారున్నారు. కానీ 60మంది మాత్రమే రోజూ వచ్చి చెత్త ఊడుస్తున్నారు. మిగిలిన 75 మంది బదిలీ వర్కర్లతో హవా నడుపుతున్నారు. అంటే వారు డ్యూటీకి రారు. వారి తరఫున బదిలీ వర్కర్లను వారే నియమిస్తారు. వారికి నెలకు రూ.7వేలు ఇస్తారు. ఇంట్లో దర్జాగా ఉంటారు. ఔట్‌సోర్సింగ్ వర్కర్లకు రూ.18,500లు వేతనం వస్తుంది. వీరిలో 409 మందికి గాను 80మందికిపైగా ఇలా బదిలీ వర్కర్లతో వ్యవహారం నడుపుతున్నారు. కొంతమంది అసలు పనికే రారు. వారి స్థానంలో బదిలీ వర్కరు కూడా ఉండరు. ఇలా నగరంలో రోజూ 30 నుంచి 35మంది వరకు పారిశుధ్య పనులకు డుమ్మా కొడుతుంటారని సమాచారం. ఇందుకు ప్రతి నెలా రూ.7వేలు సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు ఇస్తారని తెలుస్తోంది. రోజూ 30మందికి పైగా పనికి రాకపోతే పారిశుధ్యం ఎలా ఉంటుందో అధికారులకే తెలియాలి. నగరంలో చెత్త సేకరణ కీలకం. కానీ అందులో వాహనాలు ఏమాత్రం పని చేయడం లేదు.

### చెత్త ఎక్కడ వేయాలి...?

నగరంలో ప్రజలకు చెత్త వేయడం నరకప్రాయంగా మారింది. డంప్ బిన్‌ల సమస్య అధికంగా ఉంది. ఒక్కో సచివాలయంలో మూడు, నాలుగుండేవి. ఇప్పుడు ఒక్కో సచివాలయ పరిధిలో ఒకటి, రెండు మాత్రమే ఉన్నాయి. కమలానగర్‌లో 8 ఉండేవి. ఇప్పుడు రెండు మాత్రమే ఉన్నాయి. ఇంటింటి చెత్త సేకరణ జరగకపోవడంతో ప్రజలకు చెత్త ఎక్కడ వేయాలో దిక్కుతోచని పరిస్థితి. దీంతో సమీప ప్రాంతాల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తున్నారు. హౌసింగ్‌బోర్డు, సాయినగర్, అశోక్‌నగర్ తదితర ప్రాంతాల్లో రోజు వారి చెత్త సేకరణ అధ్వానంగా తయారయింది.





డిజిటల్ సాక్ష్యాలతో
# నేరం రుజువు
ఐదుగురికి యావజ్జీవ శిక్ష

రాజీ.. ఈజీ కాదు..!

వివరాలు 6, మెయిన్ 11లో

## వదలని పీడ..!

- వరి పంటలో చీడపీడల ఉధృతి
- వంకమద్ది చెరువు కింద వందల ఎకరాల సాగు
- నెలరోజుల పైరుకే ఎర్ర, తెల్ల చీడ
- ఆందోళనలో అన్నదాతలు

7

# మొక్కలు నాటడమే మార్గం

## ఇసుక దిబ్బల నివారణకు శాస్త్రవేత్తల సూచన

బొమ్మనహాళ్/కణేకల్లు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): సున్నితమైన ఇసుక దిబ్బల్లో మొక్కలను నాటి పెంచితే ఇసుక బయటకు రాకుండా అరికట్టవచ్చని శాస్త్రవేత్తలు అన్నారు. బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లోని దర్గాహోన్నూరు, మీనహళ్లి, తుంబిగనూరు గ్రామ శివారు ప్రాంతాలలోని ఇసుక దిబ్బలను సోమవారం వారు పరిశీలించారు. ఢిల్లీ, రాజస్థాన్ రాష్ట్రాల జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం స్వచ్ఛంద సంస్థ శాస్త్రవేత్తలు అమర్‌హేక్షానా, హర్షదోరియా, ఓంప్రకాష్ ఫరిధర్, రాష్ట్ర కో ఆర్డినేటర్ సంతోష్‌కుమార్, రీజనల్ మేనేజర్ డాక్టర్ కుసుమ చేత డ్వామా అధికారులు అధ్యయనం చేయించారు. డ్వామా పీడీ సలీం బాషా, ఏపీడీ అయేషా శాస్త్రవేత్తలతో మాట్లాడి, ఇసుకదిబ్బల నివారణకు సూచనలు తీసుకున్నారు. రాజస్థాన్‌లో ఇసుక బయటకు రాకుండా ప్లాంటేషన్‌తో అరికడుతున్నామని వారు వివరించారు. చెట్లు పెరిగితే ఆకులు రాలి ఇసుక బయటకు రాకుండా ఉంటుందని అన్నారు. ఇసుకలో రాలిన ఆకులతో రసాయనిక మందులు తయారవుతాయని, దీని ద్వారా ఆదాయం పొందవచ్చని శాస్త్రవేత్తలు సూచించారు. నల్లరేగడి భూములకు ఇసుకను తరలించాలని కొందరు రైతులు అధికారులను కోరారు. కార్యక్రమంలో ఈసీ రాజేష్‌కుమార్, ఏపీఓ సుధాకర్, టీఏలు సోమన్నగౌడ్, నరసింహాచారి, నాగరాజు, మాజీ సర్పంచ్ కేశప్ప, మాజీ ఎంపీటీసీ సభ్యులు ఆనంద్, టీడీపీ నాయకులు ముక్కన్న, మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.



దర్గాహొన్నూరు వద్ద పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పగటి పూట ఎండలు ముదరటం, రాత్రిపూట చలివాతావరణంతో ప్రజలను రోగాలు చుట్టుముడుతున్నాయి. వివిధ రకాల జబ్బులతో ప్రజలు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. ఈ నేపథ్యంలోనే జిల్లా కేంద్రంలోని పెద్దాస్పత్రి సోమవారం రోగులతో కిక్కిరిసిపోయింది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన బాధితులు కూడా ఈ ఆస్పత్రికే చికిత్స కోసం వచ్చారు. రోగాలు వేలాదిగా రావడంతో ఓపీ కేంద్రం కిక్కిరిసిపోయింది. చీటీ కోసం గంటలకొద్దీ క్యూలో ఉండాల్సి వచ్చింది. తోపులాట కూడా జరిగింది. ఓపీతీసుకున్న వారు తిరిగి బయటకు రావడానికికూడా స్థలం ఇవ్వకపోవడంతో నానా అవస్థలు పడాల్సి వచ్చింది. కొందరైతే ఓపీకేంద్రంలోనే ఉక్కపోతకు అల్లాడిపోతూ అక్కడే కూర్చుండిపోయారు. డాక్టర్లతో చికిత్స చేయించుకోవడానికి కూడా గంటల కొద్ది వేచి ఉండాల్సి వచ్చింది. మందులు ఇచ్చే కేంద్రాల వద్దా ఇదే పరిస్థితి. దీంతో రోగులు, వారి బంధువులు కూడా నానా అవస్థలు పడ్డారు.

### ప్రత్యామ్నాయం చూపకపోతే తిప్పలే

పెద్దాస్పత్రికి రోజురోజుకు రోగుల తాకిడి విపరీతంగా పెరుగుతోంది. ఆమేరకు అవసరమైన చర్యలు తీసుకోవడం, సౌకర్యాల కల్పనలో పాలకులు విఫలమవుతున్నారు. రాబోయే మూడునెలలు ఎండాకాలం కావడంతో

# కిటకిట..!

## రోగులతో కిక్కిరిసిన పెద్దాస్పత్రి

'ఓపీ'క లేక తీవ్ర ఇబ్బందులు

డాక్టర్ల వద్ద, మందులు ఇచ్చే చోటా భారీ క్యూ

తీవ్ర అవస్థలు పడ్డ రోగులు, బంధువులు

ప్రజలు ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితులలో ఆస్పత్రికి వచ్చే రోగులు ఇబ్బంది పడకుండా ఓపీ చీటీలు సులభతరంగా అందించేందుకు ఆలోచించాలి. అలాగే డాక్టర్లు, మందులు విభాగాల వద్ద త్వరగా పేషెంట్లకు వైద్యచికిత్సలు, మందులు అందేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. లేకపోతే రాబోయే రోజులలో రోగులు మరిన్ని కష్టాలు ఎదుర్కోక తప్పదు.



రోగులతో కిటకిటలాడుతున్న ఓపీ కేంద్రం

### ఓపీ కోసం గంటలా...



అసలే రోగంతో అల్లాడుతూ ఆస్పత్రికి వస్తాం. ఇక్కడకు వస్తే ఓపీ చీటీ కోసం గంటల కొద్దీ క్యూలో ఉండాల్సి వస్తోంది. దీంతో మరిన్ని వ్యాధుల బారిన పడాల్సి వస్తోంది. ఇది సరికాదు. రోగులు ఇబ్బంది పడకుండా వైద్యం అందించేలా చూడాలి.

-బయ్యన్న, పేషెంట్

### ముసలోళ్లకు ఇన్ని తిప్పలా..?



ఆస్పత్రిలో పెద్ద డాక్టర్లు ఉన్నారని చూపించుకోవడానికి ఇక్కడకు వస్తాం. ఇక్కడ ఇన్నితిప్పలు పడాల్సి రావడం బాధ కలిగిస్తోంది. అందులోనూ మా లాంటి ముసలోళ్ల గంటలపాటు ఇబ్బందులు పడి, ఎలా తట్టుకోగలం. రోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడితే ఆస్పత్రికి మంచి పేరు వస్తుంది.

-పద్మావతి, పేషెంట్

### అన్నిచోట్లా అవస్థలేనా..?



చికిత్స కోసం సర్వజన ఆస్పత్రికి వస్తే ఇక్కడ అన్ని చోట్లా ఇబ్బంది పడాల్సి వస్తోంది. అవస్థలుపడి ఓపీ చీటీ తీసుకొని డాక్టర్ వద్దకు వెళితే అక్కడా క్యూ భారీగా ఉంది. మందుల కోసం పోతే అక్కడా బారులు తీరారు. ఇలాంటి పరిస్థితులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలి

-చంద్రమోహన్, పేషెంట్



## అనంత నృత్యానికి అవార్డు



జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందుకుంటున్న హరిప్రసాద్ బృందం

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి శాస్త్రీయ నృత్య పోటీల్లో అనంత కళాకారులు ప్రతిభ చాటారు. భరతముని జయంతిని పురస్కరించుకుని సంస్కార భారతి, సుమధుర కళానికేతన్ సంయుక్తాధ్వర్యంలో విజయవాడలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన జాతీయస్థాయి శాస్త్రీయ నృత్యపోటీల్లో వివిధ రాష్ట్రాల కళాకారులు ప్రదర్శనలిచ్చారు. అనంతపురం నగరానికి చెందిన లహరి డ్యాన్స్ ఫిట్‌నెస్ అకాడమీ హరిప్రసాద్ శిష్యబృందం విశాల్, సాయి భరద్వాజ్, అహ్మద్, మనోజ్, కార్తీక్, అక్షయ జానపద నృత్య విభాగంలో జాతీయస్థాయిలో విజేతగా నిలిచింది. వీరి బృందానికి సంస్కార భారతి సాహిత్య సంయోజకుడు కప్పగంతు రామకృష్ణ, సుమధుర కళానికేతన్ గౌరవాధ్యక్షుడు ఎంసీ దాస్, కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యురాలు ఎస్పీ భారతి, విశ్రాంత సైనికాధికారి చలసాని బలరామయ్య.. జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందజేశారు.

## వంద కోట్లు ఇక్కడ..!

## నాకే పనిచెబుతారా..?

పుట్లూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): 'వంద కోట్ల ఆస్తిపరున్ని. నాకే చిన్న చిన్న పనులు చెబుతారా?' అంటూ ఓ పంచాయతీ కార్యదర్శి పుట్లూరు ఎంపీడీఓపై చిందులు వేశారు. ఎం-బుక్కులో సంతకం కోసం మూడు రోజుల క్రితం ఆయన ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చారు. కార్యాలయంలో ఓ అధికారి సంతకం పెట్టకపోవడంతో ఆయన రెచ్చిపోయారు. 'తాడిపత్రిలో నాకు రూ.వందకోట్ల ఆస్తి ఉంది. నాకే రీపోల్ సర్వే పనులు చెబుతారా?' అంటూ ఎంపీడీఓపైనే చిందులు వేశారు. అలా మాట్లాడటం పద్ధతి కాదని ఉద్యోగులు సర్దిచెప్పినా వినిపించుకోలేదు. పైగా వారిపైనా అంతెత్తు లేచారు. 'మీరెంత..? మీ స్థాయి ఎంత..?' అని హేళన చేశారు. ఎంపీడీఓ కార్యాలయంలోని ఓ మహిళా ఉద్యోగిని ఆయన కొన్ని నెలల నుంచి వేధిస్తున్నారని సమాచారం. కార్యాలయంలో చిన్నపాటి ఖర్చుల విషయంలో ఇద్దరి మధ్య వివాదం తలెత్తినట్లు తెలుస్తోంది. ఆ అధికారి వ్యవహారశైలి సోషల్ మీడియాకు చేరింది. ఆ కార్యదర్శి వ్యవహరించిన తీరుపై ఉన్నతాధికారులకు నివేదించామని ఎంపీడీఓ అలివేలమ్మ తెలిపారు.

### జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): సీడాప్ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలని మైనార్టీ కార్పొరేషన్ ఉమ్మడి అనంత జిల్లా ఈడీ సుబ్రమణ్యం తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మంగళవారం అనంతపురంలోని కోర్టు రోడ్డు నందుగల జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం, రాయదుర్గంలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో జాబ్‌మేళాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మైనార్టీ వర్గాలకు చెందిన ముస్లిం, క్రైస్తవ, సిఖ్, బౌద్ధ, జైన యువతీ, యువకులు విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరై సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### రేపు ఫెన్సింగ్ జట్టు ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మురళీకృష్ణ, పుష్పావతి తెలిపారు. అండర్-14 బాల, బాలికల క్యాటగిరిలో స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు జనన ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డు, యూనిఫాం, క్రీడాసామగ్రితో హాజరు కావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఎన్టీఆర్ జిల్లాలో మార్చి 2న నిర్వహించే రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబరు 9553768295ను సంప్రదించాలని కోరారు.

### డ్వామా ఏపీడీలకు స్థానచలనం

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): డ్వామా పరిధిలోని పలువురు ఏపీడీలకు స్థానచలనం కల్పించారు. గుత్తి క్లస్టర్ ఏపీడీగా ఉన్న విజయ్‌కుమార్‌ను తాడిపత్రి క్లస్టర్ ఏపీడీగా బదిలీ చేశారు. ఉరవకొండ ఏపీడీగా ఉన్న గిరిధర్‌ను తప్పిస్తూ విజయ్‌కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. రాయదుర్గం ఏపీడీగా ఉన్న ఆయేషాను గుత్తికి బదిలీ చేశారు. కళ్యాణదుర్గం డీఎల్‌డీఓ నాగేశ్వరరావుకు రాయదుర్గం క్లస్టర్ ఏపీడీగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు సోమవారం డ్వామా పీడీ సలీంబాషా ఉత్తర్వులు జారీ చేశారు.

### విద్యార్థి అదృశ్యం



శశికుమార్

గార్లదిన్నె, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మర్తాడు గ్రామానికి చెందిన శశికుమార్ అనే విద్యార్థి అదృశ్యమైనట్లు ఎస్ఐ మహమ్మద్‌గౌస్ బాషా తెలిపారు. మర్తాడు గ్రామానికి చెందిన సుధాకర్ కుమారుడు శశికుమార్ స్థానిక ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. ఆదివారం కోటంకలో జరుగుతున్న తిరునాళ్లకు ఇంట్లో చెప్పకుండా వెళ్లి వచ్చాడు. ఇంట్లో చెప్పకుండా వెళతావా అంటూ తల్లి ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో శశికుమార్ కనిపించకుండా వెళ్లిపోయాడు. సాయంత్రం వరకు స్నేహితులు, బంధువుల వద్ద వెతికారు. కనిపించకపోవడంతో సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విద్యార్థి కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# రాజీ.. ఈజీ కాదు..!

మూడేళ్లకు పైగా శిక్ష పడే కేసుల్లో విచారణ తప్పదు

ప్రత్యక్ష సాక్షులు చెప్పకపోయినా.. నేరం రుజువు కావచ్చు

మట్టి పవన్ కుమార్ హత్య కేసులో ఫలించని రాజీ

ఐదుగురు ముద్దాయిలకు జీవితకాల శిక్ష

పెడతోవ పట్టిన పేద కుటుంబాల యువకులు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రత్యక్ష సాక్షులు మౌనం వహించినా.. హత్య కేసులో ఐదుగురికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష పడింది. అరుదైన ఈ తీర్పును అనంతపురం జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ వెలువరించారు. నార్పల మండల కేంద్రానికి చెందిన మట్టి పవన్‌కుమార్ హత్య కేసులో నేరాన్ని డిజిటల్ సాక్ష్యాలు, అధికారుల వాంగ్మూలం ఆధారంగా నిర్ధారించారు. ముద్దాయిలు ఐదుగురికి కఠిన జీవిత ఖైదు, ఒక్కొక్కరికి రూ.20 వేల జరిమానా విధించారు. న్యాయవాదుల సమక్షంలో రాజీ కుదిరినా, క్రిమినల్ కేసు కావడంతో ముద్దాయిలు విచారణను ఎదుర్కొనక తప్పలేదు. ప్రాసిక్యూషన్, డిఫెన్స్ వాదించకా తప్పలేదు. ఈ కేసు తీర్పు సంచలనంగా మారింది. సివిల్ కేసులో ఎంతటి వివాదం ఉన్నా రాజీ కావచ్చు. కానీ క్రిమినల్ కేసుల్లో రాజీ అంత ఈజీ కాదంటున్నాయి న్యాయవాద వర్గాలు. సివిల్ కేసుల్లో రెండు పార్టీలు నిబంధనల ప్రకారం ఒప్పంద పత్రాన్ని రాసుకుని, న్యాయసేవా అధికార సంస్థ నిర్వహించే లోక్ అదాలత్‌లో రాజీ కావచ్చు. క్రిమినల్ కేసుల్లో కొన్ని సెక్షన్లకు రాజీ కుదిరే అవకాశం ఉంటుంది. మూడేళ్లలోపు శిక్ష పడే కేసులకే ఈ వెసులుబాటు ఉంటుంది. అంతకు మించి శిక్ష పడే సెక్షన్లు ఉంటే రాజీ కుదరదు. హత్య, హత్యాయత్నం, మహిళలను అసభ్యంగా తాకడం, అసభ్యంగా ప్రవర్తించడం, దివ్యాంగులపై దాడి వంటివి తీవ్రమైన నేరంగా పరిగణిస్తారు. వీటి విషయంలో రాజీకి తావులేదు. చెక్‌బౌన్సు కేసులలో కూడా ఒక్కోసారి రాజీ కుదరదని న్యాయవాదులు చెబుతున్నారు.

**కేసు వాదించాల్సిందేనా..?**

ఇరువర్గాలు రాజీ అయితే కేసు తేలిపోతుందని, ఇంకేమీ ఉండదని భావిస్తారు. కానీ తీవ్రమైన నేరాల విషయంలో రాజీపడినా కేసు కొనసాగుతుంది. రాజీ కుదిరితే.. అవతలి వారు డబ్బు తీసుకుని సాక్ష్యం చెప్పరు. ఒక్కోసారి సాక్షులంతా వ్యతిరేకంగా చెబుతుంటారు. గతంలో తాము అలా చెప్పలేదని కూడా తేలిపోతుంటారు. ఇలాంటి సందర్భంలో కేసు వీగిపోయే అవకాశాలు ఉంటాయి. ఇవన్నీ రాజీ కారణంగా జరిగే పరిణామాలు. కానీ తర్పుమాత్రం న్యాయాధికారి నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మట్టి పవన్‌కుమార్ హత్య కేసులోనూ ప్రత్యక్ష సాక్షులు ఏమీ చెప్పలేదు. కానీ హత్య చేస్తుండగా తీసిన వీడియో, పోస్టుమార్టం చేసిన వైద్యుల నివేదిక, పోలీసు అధికారుల సాక్ష్యం ఇవన్నీ కేసును బలంగా నిలబెట్టాయి. రాజీ కుదిరినా.. ముద్దాయిలకు శిక్ష తప్పలేదు.

జైలుపాలైన ఐదుగురు ముద్దాయిలు వీరే..



### హతుడు, తండ్రిపైనా కేసులు

హతుడు మట్టి పవన్‌కుమార్, అతని తండ్రిపైనా కేసులున్నాయి. పవన్ కుమార్‌పై నార్పల పోలీస్‌స్టేషన్‌లో బైక్ దొంగతనం కేసు, అమ్మాయిల వేధింపుల కేసు ఉన్నాయి. నాలుగేళ్ల క్రితం నార్పలలో సినిమా థియేటర్‌కు వెళ్లాడు. అక్కడ రష్‌గా ఉండటంతో కానిస్టేబుల్ గౌస్ వెళ్లిపొమ్మని హెచ్చరిస్తూ లాఠీతో ఓ దెబ్బ వేశాడు. దీంతో ఇంటికి వచ్చిన పవన్‌కుమార్, తల్లిదండ్రులతో విషయం చెప్పాడు. వెంటనే ఇద్దరూ ఓ కత్తి ఇచ్చి పొడిచి రమ్మని చెప్పారట. పవన్‌కుమార్ ఆ కత్తి తీసుకొచ్చి కానిస్టేబుల్‌ను వెనుకనుంచి పొడిచాడు. అతనికి తీవ్ర రక్తగాయాలయ్యాయి. ఈ ఘటనపై నార్పల పోలీస్‌స్టేషన్‌లో పవన్‌కుమార్, తండ్రి శ్రీనివాసులు, తల్లిపైనా కేసు నమోదైంది. అది ఇంకా కోర్టులో నడుస్తోంది. ఎర్రచందనం తరలిస్తున్న ఐచర్‌లో వెళ్లడంతో శ్రీనివాసులుపై చిత్తూరు జిల్లాలో కేసు నమోదైంది.

### రూ.16 లక్షలు పోశాం!

ఈ కేసులో రాజీ కుదుర్చుకునేందుకు న్యాయవాదుల సమక్షంలో డబ్బులు ఇచ్చామని ముద్దాయిల తల్లిదండ్రులు కోర్టు ప్రాంగణంలో ఆరోపించారు. ఐదుగురి తరపున మొత్తం రూ.16 లక్షలు ఇచ్చామని తెలిపారు. కోర్టు తీర్పు వెలువడగానే ముద్దాయిల తల్లిదండ్రులు, బంధువులు బోరున విలపించారు. హతుడి కుటుంబ సభ్యులకు డబ్బు ఇచ్చినా రాజీ కుదరలేదని కన్నీటి పర్యంతమయ్యారు. హత్యకు గురైన పవన్‌కుమార్ గతంలో ఓ కానిస్టేబుల్‌ను పొడిచినా, మరిన్ని అరాచకాలు చేసినా కేసులు పెట్టలేదని అన్నారు. అలాంటి వాణ్ణి చంపిన తమ వారిని జైలుకు పంపుతున్నారని వాపోయారు. కాగా, కోర్టు ప్రాంగణంలో ముద్దాయిల తల్లిదండ్రులు చేసిన ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. కేసు జరుగుతున్న క్రమంలో ఓ ప్రముఖ న్యాయవాది సమక్షంలో హతుడి తల్లిదండ్రులకు రూ.12 లక్షలు ఇప్పించినట్లు సమాచారం. మిగిలిన రూ.4 లక్షలు ముద్దాయిల తల్లిదండ్రులకు వెనక్కు ఇచ్చారన్న ప్రచారం జరిగింది. రాజీ నేపథ్యంలో సాక్షులుగా ఉన్నవారు కోర్టులో జరిగింది చెప్పడానికి నిరాకరించినట్లు తెలిసింది.

పేద కుటుంబాలు..



జిల్లా కోర్టు వద్ద ముద్దాయిల కుటుంబ సభ్యుల కన్నీరు..

హత్యకేసులో శిక్ష పడిన ఐదుగురివీ పేద కుటుంబాలు. కొడుకులు సంపాదిస్తే తప్ప పూట గడవదని తల్లిదండ్రులు కంటతడి పెట్టారు. కుటుంబ పరిస్థితులు తెలిసినా.. వ్యసనాలు, చెడు సావాసాల కారణంగా జైలుపాలయ్యారు. మట్టి పవన్‌కుమార్ హత్య కేసులో నార్పలకు చెందిన డిపో సాజిద్, చింతాకు రమేష్, చిక్కేపల్లి నాగేంద్ర, తలారి సుధాకర్, తలారి అరుణ్‌కు జీవితకాలపు కఠిన కారాగార శిక్ష పడింది. వీరందరికీ 25 ఏళ్లలోపే వయసు. ఎంతో భవిష్యత్తున్న వీరు జైలు పాలు కావడానికి వారు ఎంచుకున్న దారే కారణం.

- సాజిద్ తండ్రి చిన్న మహబూబ్‌బాషా వంట మాస్టర్. శుభకార్యాలు ఉన్నప్పుడు పని దొరుకుతుంది. తల్లి ముష్కీనా గృహిణి. ఇద్దరు కొడుకులు. సాజిద్, అతని అన్న బాబావలి ఇద్దరూ మెకానిక్‌లు. సాజిద్‌కు వివాహం కాలేదు. మద్యానికి బానిసయ్యాడు. గతంలో గొడవలకు వెళ్లాడు. ఒకటి రెండు కేసులు ఉన్నట్లు సమాచారం.
- చింతాకు రమేష్ తల్లిదండ్రులు పెద్దకుళ్లాయప్ప, వరలక్ష్మి. మూడెకరాల పొలంలో వ్యవసాయం చేస్తుంటారు. వీరికి ఒక కూతురు కూడా ఉంది. రమేష్ అనంతపురంలోని పీవీకేకే డిగ్రీ కళాశాలలో సెకండియర్ చదువుతున్నాడు. గతంలో కేసులేమీ లేవు. ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇద్దరూ అనధికారికంగా విడిపోయారు.
- తలారి సుధాకర్ తల్లిదండ్రులు పుల్లయ్య, ఈశ్వరమ్మ. తండ్రి కొన్నేళ్ల క్రితమే మృతి చెందాడు. సుధాకర్‌కు ఇద్దరు సోదరులు.. వారు చిన్నపాటి వ్యాపారం చేసుకుంటున్నారు. సుధాకర్ ప్లాస్క్‌లో టీ అమ్ముతూ జీవనం సాగించేవాడు. మద్యం తదితర వ్యసనాలున్నాయి. గతంలో కేసులేమీ లేవు.
- చిక్కేపల్లి నాగేంద్ర తల్లిదండ్రులు నాగరాజు, లక్ష్మి. తండ్రి నాగరాజు కొన్నేళ్ల క్రితమే చనిపోయాడు. లక్ష్మి కూలి పనికి వెళ్తుంటుంది. నాగేంద్రకు మద్యం వంటి వ్యసనాలున్నాయి. ఎలాంటి పని చేయడు. కేసులేమీ లేవు.
- తలారి అరుణ్ తల్లిదండ్రులు ఆదినారాయణ, లక్ష్మిదేవి. ఇద్దరూ కూలి పనిచేస్తుంటారు. వీరికి కూతురు కూడా ఉంది. తలారి అరుణ్ స్నేహితులతో కలిసి జులాయిగా తిరిగేవాడు. ఇతనిపైనా గతంలో కేసులేమీ లేవు.

### న్యాయం జరిగింది: మట్టి శ్రీనివాసులు, మృతుని తండ్రి



ఈ రోజు నా కొడుకు లేడు. న్యాయాధికారి, పోలీసులు, న్యాయవాదుల వల్ల మాకు న్యాయం జరిగింది. వారికి పాదాభివందనం. ప్రాణం పోయినా వారిని మరచిపోలేను. నెల్లూరు నుంచి బతకడానికి నార్పలకు వచ్చాము. నార్పల సుల్తాన్‌పేటలో మాది ఒకే ఇల్లు. వారివి 400 ఇల్లు. వారి బలం తట్టుకోలేక అనంతపురం చేరినా నా కొడుకును వదిలిపెట్టలేదు. ఈ జడ్జి భగంతుడు. నాకు సాయం చేశాడు. జీవితాంతం రుణపడి ఉంటాను. ఓ కేసుంది. అది అయిపోతే నెల్లూరు చేరుకుంటాను.

## రైతుల బాధలను వినండి

భూములిచ్చిన అన్నదాతలను ఆదుకోండి

జలవనరుల శాఖ మంత్రికి పరిటాల సునీత విజ్ఞప్తి



నిమ్మల రామానాయుడుకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా రెండోదశ కాలవ లైనింగ్ పనులకు సంబంధించి తమ ప్రాంత రైతుల బాధలు, అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోవాలని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం అసెంబ్లీ సమావేశాల అనంతరం మంత్రిని ఆయన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కలిసి వినతి పత్రం అందజేశారు. లైనింగ్ పనుల వల్ల తమ ప్రాంతంలోని చెరువులకు నీరందే అవకాశం లేదన్నారు. తద్వారా భూగర్భజలాలు తగ్గే ప్రమాదం ఉందని ఆమె మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కాలువ వెంబడి ఉన్న వివిధ చెరువులు, కుంటలకు హంద్రీనీవా నీరు అందేలా తూములను ఏర్పాటు చేయాలని కోరారు. రైతులు, ప్రజలు కాలువను దాటే విధంగా వంతెనలు నిర్మించాలని కోరారు. తీవ్ర కరువు ప్రాంతమైన రాప్తాడు నియోజకవర్గంలో హంద్రీనీవా నీరు వచ్చిన తర్వాత వ్యవసాయం చేసుకుంటున్నారని అన్నారు. హంద్రీనీవా లైనింగ్ చేపడితే కాలువ వెంబడి ఉన్న 38 చెరువులకు నీరు ఆగిపోవడం వల్ల రైతులు నష్టపోతారని అన్నారు. జీడిపల్లి నుంచి పేరూరు ప్రాజెక్టుకు నీరందించే పరిటాల రవీంద్ర అప్పర్ పెన్నార్ ఎత్తిపోతల ప్రాజెక్టు కోసం భూములిచ్చిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. 2018లో భూములిచ్చిన చాలా మంది రైతులకు ఇప్పటికీ పరిహారం అందలేదన్నారు. రూ.14.50 కోట్లు విడుదల చేసి రైతులకు పరిహారం అందించడంతో పాటు.. ప్రాజెక్టు పనులకు నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. ఇటీవల భారీవర్షాలకు తెగిపోయిన కనగానపల్లి చెరువు మరమ్మతుకు, నడిమివంక రక్షణ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు. స్పందించిన మంత్రి రామానాయుడు.. రైతులకు పరిహారం చెల్లించేలా వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

## నమ్మితే.. ముంచేశాడు

వ్యాపారిపై పోలీసులకు రైతుల ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న రైతులు

బెళుగుప్ప, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రైతులు ఎంతో నమ్మకంతో నిల్వ ఉంచిన ధాన్యాన్ని వారికి తెలియకుండానే గోడౌన్ యజమాని అమ్మేసుకున్నాడు. దీంతో లబోదిబోమంటూ రైతులు పోలీసులను ఆశ్రయించిన సంఘటన సోమవారం మండలంలో జరిగింది. బెళుగుప్పకు చెందిన వ్యాపారి విక్రమ్‌పై నమ్మకంతో వివిధ గ్రామాలకు చెందిన పప్పుశనగ రైతులు 2022లో అనామతు వ్యాపార లావాదేవీల్లో భాగంగా తమ పంటను ఆయన గోదాముల్లో నిల్వ ఉంచారు. అంకంపల్లి, దుద్దేకుంట, రామసాగరం, వెంకటాద్రిపల్లి రైతులు తమ పప్పుశనగ దిగుబడిని గోదాములో నిల్వ ఉంచారు. అంకంపల్లిలోనే 20 మంది రైతులు 1700 క్వింటాళ్లు అనామతిపై గోదాములో నిల్వ ఉంచారు. ఈ ఊర్లో వెంకటనాయుడు అనే రైతు ఒక్కడే 750 క్వింటాళ్లు నిల్వ ఉంచాడు. అయితే వ్యాపారి ఆయా రైతులకు తెలియకుండా సరుకంతా అమ్ముకుని కర్ణాటక ప్రాంతానికి ఉడాయించాడు. అనంతరం రైతులకు ఐపీ నోటీసులు పంపాడు. దీంతో తాము రేయింబవళ్లు కష్టపడి పండించిన పంటను కోల్పోయి, మోసపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంకంపల్లిలోనే రూ.రెండు కోట్లపైనే మోసపోయారు. మండలంలో రూ.3 కోట్ల నుంచి రూ. 4 కోట్ల వరకు మోసపోయినట్లు రైతులు పేర్కొన్నారు. ఈ మొత్తం ఐపీ నోటీసులు అందుకొని రైతులకు సంబంధించినది మాత్రమే. ఇంకా ఐపీ నోటీసులు అందుకున్న బాధిత రైతులకు సంబంధించి పెద్దమొత్తం ఉన్నట్లు సమాచారం.

### కష్టపడి పండించినా...: రమేష్, రైతు, అంకంపల్లి



నా గోదాములో నిల్వ చేసుకోండి. ధర వచ్చినప్పుడు అమ్ముకోండి అని వ్యాపారి విక్రమ్ చెప్పాడు. అతడిపై నమ్మకంతో 2022లో 750 క్వింటాళ్ల పప్పుశనగ, 60 క్వింటాళ్ల ధనియాలు, తగ్గుపర్తి వద్ద ఉన్న శివసాయి వేర్ హౌస్‌కు తరలించాం. రేటు రాగానే అమ్ముకుందామంటే గోదాములో సరుకులేదు. ఏమి చేయాలో దిక్కుతోచడం లేదు.

### తీవ్రంగా నష్టపోతున్నాం: ప్రకాష్, రైతు, అంకంపల్లి



బెళుగుప్పకు చెందిన వ్యాపారి విక్రమ్ తనకు గోదాములో వాటా ఉందని నమ్మించాడు. 78 క్వింటాళ్ల పప్పుశనగ పంట పట్టించా. డబ్బులు అడిగితే అదిగో ఇదిగోనంటూ అందుబాటులో లేకుండాపోయాడు. ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతును ఇలా మోసపుచ్చే వ్యాపారులతో నష్టపోతున్నాం. కోలుకోలేకపోతున్నాం. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

## డీఆర్‌ఓపై చర్యలు తీసుకోవాల్సిందే



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు

అనంతపురం టౌన్/సెంట్రల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ అభిప్రాయాలు స్వీకరిస్తున్న వేదికపై ఆన్‌లైన్ పేకాట ఆడిన డీఆర్వో మలోలపై చర్యలు జాప్యం కావడంతో ఎస్సీ, ఎస్టీ సంఘాలు కలెక్టరేట్ వద్ద ఆందోళనకు దిగాయి. కలెక్టర్‌కు విచారణ నివేదిక అందినా చర్యలు తీసుకోకపోవడంతో ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళనకు దిగారు. ఆయనపై చర్యలు తీసుకోకుండా ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కించడం ఏమిటని సాకే హరి నిలదీశారు. కలెక్టరేట్ వద్ద రాత్రి 9 గంటల వరకూ ధర్నా కొనసాగించారు. దీంతో ట్రైనీ డీఎస్పీ అష్రఫ్ వలి, సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ వారితో మాట్లాడారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని హామీ ఇచ్చి, విరమింపజేశారు.

### లైటింగ్ ఏర్పాటుకు అనుమతులు తీసుకోండి

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రికి ఆలయాలు, వీధుల్లో సీరియల్ లైట్ల ఏర్పాటుకు విద్యుత్తు శాఖ అనుమతులు తీసుకోవాలని ఆ శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్ సూచించారు. లైట్లను సురక్షితంగా ఏర్పాటు చేయడానికి ఐటీఐ విద్యార్హత, అనుభవం ఉన్న ఎలక్ట్రీషియన్స్‌ను నియమించుకోవాలన్నారు. అనుమతులు, చార్జీలు, సురక్షిత చర్యల వివరాలకు ఏపీ ఎస్పీడీసీఎల్ కార్యాలయాలనికి వెళ్లి తీసుకోవాలన్నారు.

### రైళ్ల రద్దు.. దారి మళ్లింపు

గుంతకల్లు, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): పెనుకొండ-మక్కాజిపల్లి రైల్వే సెక్షన్‌లో జరుగుతున్న నాన్ ఇంటర్లాకింగ్ పనుల వల్ల ప్యాసింజరు రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు సోమవారం తెలిపారు. గుంతకల్లు-హిందూపురం(77213) ప్యాసింజరును ఈనెల 25 నుంచి 27 వరకూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (77214) ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకూ రద్దు చేసినట్లు తెలిపారు. బెంగళూరు-ధర్మవరం-బెంగళూరు (06595/96) రైళ్ల ను ఈ నెల 25 నుంచి 28 వరకూ ధర్మవరం-హిందూపురం సెక్షన్‌లో రద్దు చేసి హిందూపురం-బెంగళూరు సెక్షన్‌లో నడుపుతామని తెలిపారు.

- గోరఖ్‌పూర్-యశ్వంతపూర్ (22533), అహ్మదాబాద్-యశ్వంతపూర్ (22689) రైళ్లను ఈ నెల 24న ధర్మవరం-పెనుకొండ-హిందూపురం స్టేషన్ల మీదుగా మళ్లించారు. కలబురగి-బెంగళూరు (22231) రైలును ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకూ అనంతపురం-ధర్మవరం-పెనుకొండ-యల్హంక స్టేషన్ల మీదుగా, కాచిగూడ-యశ్వంతపూర్ (20703) ఈనెల 25నుంచి 28 వరకూ, హుబ్లీ-మైసూర్ 15591), కాచిగూడ-మైసూరు (12785), నాందేడ్-బెంగళూరు (నం. 16594) రైళ్లను ఈ నెల 26 నుంచి 27 వరకూ ధర్మవరం-శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం-పెనుకొండ స్టేషన్ల మీదుగా మళ్లించనున్నారు.




మండే ఎండను లెక్కచేయక..
ఒంటి కాలిపై..
గంటల కొద్దీ చేశాం జపం..
కాసింత ఆహారం కోసం..
దొరికితే తిన్నాం..
లేదంటే పస్తున్నాం..
చెరువే ఆధారం.. ఆవాసం..
అందులో నీరుంటేనే జీవనం..
ఆ ఆశ ఇంకిపోతోంది..
కొంగలం జపం చేయగలం..
భగీరథులై తపం చేయలేం..
గంగను రప్పించనూ లేం..
ఓటర్లు కూడా కాం..
పోరాడి నీటిని తెచ్చుకోలేం..
ప్చ్.. ఏం చేయగలం..?
ఈ వేసవి ఎలా నెట్టుకురాగలం?

- ఆంధ్రజ్యోతి, యాడికి

యాడికి మండలంలోని ఆదర్శ పాఠశాల సమీపాన ఉన్న వంకలోని నీటి గుంత గట్టుపై కొంగల గుంపు

## క్రైం కార్నర్ ■ క్రషర్‌లో పడి యువకుడి మృతి


సురేంద్ర (ఫైల్)

గుత్తిరూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండంలోని జ క్కలచెరువు గ్రామ సమీపాన సోమవారం ప్రమాదవశాత్తు క్రషర్‌లో పడి యువకుడు సురేంద్ర(34) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తొండపాడు గ్రామానికి చెందిన సురేంద్ర క్రషర్ మిషన్‌లో పనికెళ్తుండేవాడు. సోమవారం మధ్యాహ్నం పనిచేస్తుండగా మిషన్‌లో రాళ్ల అడ్డు పడడంతో వాటిని తీయడానికి వెళ్లాడు. అక్కడ మిషన్‌లోకి వచ్చే రాళ్ల ప్రమాదవశాత్తు సురేంద్ర మీద పడ్డాయి. తోటి కూలీలు రాళ్ల తొలగించేలోపు అతడు మరణించాడు. మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సురేంద్రకు భార్య, కుమారుడు ఉన్నారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

## రోడ్డు ప్రమాదంలో టీడీపీ నాయకుడి దుర్మరణం

- మరో ఇద్దరికి గాయాలు


అంజప్ప (ఫైల్)

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): చెరుకూరు సమీపంలో సోమవారం ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో టీడీపీ నాయకుడు అంజప్ప(58) మృతిచెందగా.. మరో ఇద్దరు గాయపడ్డారు. రొద్దం ఏఎ్‌సఐ నాగరాజు తెలిపిన మేరకు.. పెద్దమంతూరు రొప్పాల గ్రామానికి చెందిన అంజప్ప పని నిమిత్తం ద్విచక్రవాహనంలో కర్ణాటకలోని వెంకటాపురం వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. చెరుకూరు వద్దకు రాగానే అదే ఊరికి చెందిన కిరణ్ ద్విచక్రవాహనంలో అంజప్ప బైక్‌ను వెనుకనుంచి ఢీకొట్టాడు. ప్రమాదంలో అంజప్ప అక్కడికక్కడే మృతిచెందాడు. కిరణ్‌తోపాటు వెనుక కూర్చున్న ఈశ్వరమ్మ గాయపడ్డారు. అంజప్పకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. విషయం తెలుసుకున్న మంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథి.. అంజప్ప కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించి, అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు.

## జోరుగా కంది కొనుగోళ్లు


కందులను విక్రయిస్తున్న రైతులు

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలో కంది కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. మార్క్‌ఫెడ్, వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఈనెల 1వ తేదీ నుంచి మండలంలో కంది కొనుగోలు ప్రారంభించారు. క్వింటా రూ.7550 ధరతో కొనుగోలు చేస్తున్నారు. రాచానపల్లి, చియ్యేడు సహకార పరపతి సంఘాల్లో కంది కొనుగోళ్లు చేపడుతున్నారు. మండల వ్యాప్తంగా 844 మంది రైతులు కంది పంట విక్రయాలకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈనెల 22వ తేదీ వరకు 527 మంది రైతులు పంటను విక్రయించుకున్నారు. చియ్యేడు సహకార పరపతి సంఘంలో 341 మెట్రిక్ టన్నులు, రాచానపల్లిలో 193 మెట్రిక్ టన్నుల కందులను రైతులు విక్రయించారు. పీఏసీఎస్‌లో కందుల కొనుగోలు అనంతరం అవి గోదాముకు చేరిన తరువాత రైతులకు డబ్బు చెల్లిస్తారని అధికారులు చెబుతున్నారు.

## మోసగిస్తే క్షమించేది లేదు: విజిలెన్స్ డీజీ

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంకుల్లో మోసాలకు పాల్పడితే క్షమించేది లేదని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ హరీష్ కుమార్ గుప్తా హెచ్చరించారు. సోములదొడ్డి, సనప సమీపంలోని పెట్రోల్ బంకుల్లో మోసాలపై జిల్లా అధికారుల నుంచి డీజీ కార్యాలయానికి నివేదిక అందింది. దీంతో ఆయన సీరియస్ అయ్యారు. సామాన్యులపై ప్రభావం చూపేలా మోసగించేవారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ సోమవారం ప్రకటన విడుదల చేశారు. సోములదొడ్డి సమీపంలోని శ్రీవిజయలక్ష్మి ఆటోకేర్ పెట్రోల్ బంక్‌లో చిప్‌ను వినియోగించి డీజిల్ దోచుకుంటున్న విషయం లీగల్ మెట్రాలజీ, విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో బయటపడిన విషయం తెలిసిందే. ఆత్మకూరు మండలంలోని సనప గ్రామం వద్ద ఉన్న పెట్రోల్ బంకులో శనివారం దాడులు నిర్వహించారు. అధికారులు గుర్తించలేని స్థాయిలో అత్యాధునిక చిప్‌ను అమర్చి, పెట్రోల్‌ను దోచుకుంటున్నట్లు విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం గుర్తించారు. రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలను కొనసాగించాలని విజిలెన్స్ డీజీ ఆదేశించారు.



# నిధులున్నా.. నిర్లక్ష్యం..!

## కమ్మూరు ఉన్నత పాఠశాలలో ఆగిపోయిన పనులు

- విద్యార్థులకు తప్పని తిప్పలు
- తాగడానికి బోరు నీరే దిక్కు

కూడేరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): నిధులు సిద్ధంగా ఉన్నా.. నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధి పనులు అటకెక్కాయి. మండలంలోని కమ్మూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌ల నిర్మాణ అర్ధంతరంగా ఆగిపోయింది. అదనపు తరగతి గదుల పనులు మొదలవనేలేదు. దీంతో విద్యార్థినీవిద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారు తాగడానికి శుద్ధి నీరు కూడా లేదు. బోరు నీటితోనే దాహం తీర్చుకుంటున్నారు.

### నిధులున్నా..

కమ్మూరు ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 90 మంది విద్యార్థులుచదువుకుంటున్నారు. గత ప్రభుత్వం రెండో విడత నాడు-నేడు కింద పాఠశాలల్లో వివిధ రకాల అభివృద్ధి పనులకు రూ.28 లక్షలు మంజూరు చేసింది. మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లతోపాటు వంటగది తదితర పనుల నిర్మాణం చేపట్టారు. దాదాపు రూ.21 లక్షల వరకు నిధులు ఖర్చు చేసినా ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. ప్రస్తుతం రూ.7 లక్షల వరకు నిధులున్నాయి. ఉన్న నిధులతో ఆగిపోయిన పనులను పూర్తి చేయవచ్చు. ప్రభుత్వం మారడంతో పాఠశాలకు నూతనంగా తల్లిదండ్రుల కమిటీ ఎంపిక చేశారు. అధికారులు కూడా ఆగిపోయిన పనులపై దృష్టి పెట్టలేదు. ఆగిపోయిన పనులను పూర్తి చేయాలని పాఠశాల చైర్మన్ పల్లకి ఎర్రిస్వామి, కమిటీ సభ్యులు పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. నిధులున్నా.. మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు, వంటగది తదితర పనులు అసంపూర్తిగా ఉన్నాయి.


అర్ధంతరంగా నిలిచిపోయిన మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌ల నిర్మాణం



గదుల నిర్మాణం కోసం ధ్వంసం చేసిన గదిపైన గోడలు

### బోరు నీరే దిక్కు

పాఠశాలలో విద్యార్థులకు బోరు నీరే దిక్కయింది. మధ్యాహ్న భోజనం వండడానికి కూడా బోరు నీరు వినియోగిస్తున్నారు. గ్రామానికి దూరంగా ఉన్న పాఠశాలలో శుద్ధి నీటి వసతి లేకపోవడంతో మధ్యాహ్న భోజనం తిన్న విద్యార్థులు బోరు నీటితో దాహం తీర్చుకుంటున్నారు. నాడు-నేడు కింద సరఫరా చేసిన శుద్ధి చేసే మిషన్ అమర్చకపోవడంతో నిరుపయోగంగా ఉంది. గతంలో పలువురు విద్యార్థులు పాఠశాలలో బోరు నీరు తాగి, అస్వస్థతకు లోనైనట్లు తెలిసింది.

### అటకెక్కిన అదనపు గదుల నిర్మాణం

కమ్మూరు ఉన్నత పాఠశాలలో మూడు అదనపు తరగతి గదులను మంజూరు చేశారు. ఒక్కో గది నిర్మాణానికి రూ.13 లక్షలు చొప్పున రూ.39 లక్షలు విడుదల చేశారు. అప్పట్లో వైసీపీ నాయకులు ఆగమేఘాల మీద పాఠశాల పైభాగంలో అదనపు గదుల నిర్మాణానికి పాఠశాల పైన గోడలను ధ్వంసం చేశారు. అంతలోనే మంజూరైన నిధులు వెనక్కి వెళ్లాయని అధికారులు చల్లగా చెప్పారు. గదుల నిర్మాణ పనులు చేయడానికి ధ్వంసం చేసిన పాఠశాల గదిపైన గోడలతోపాటు పిల్లర్లు అలాగే వదిలేశారు. ఈ నేపథ్యంలో వర్షాలు కురిస్తే గోడల నుంచి వర్షపు నీరు గోడల్లోకి వెళ్లి, పాఠశాల గదులు దెబ్బతినే ప్రమాదం ఉందని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.

### పనుల పూర్తికి చర్యలు తీసుకుంటాం

పాఠశాలలో నాడు-నేడు రెండో విడత కింద పలు అభివృద్ధి పనులకు రూ.28 లక్షలు మంజూరయ్యాయి. అందులో వివిధ రకాల పనులు చేశారు. ప్రస్తుతం రూ.7 లక్షల నిధులున్నాయి. వాటితో ఆగిపోయిన పనులు చేయడానికి నూతన కమిటీ సభ్యుల పేరున బ్యాంకు ఖాతా తెరవాల్సి ఉంది. త్వరలోనే అకౌంట్ ఓపెన్ చేసి, పనులు పూర్తి చేస్తాం.

-రవిశంకర్, పాఠశాల హెచ్ఎం

# వదలని పీడ..!

- వరి పంటలో చీడపీడల ఉధృతి
- వంకమద్ది చెరువు కింద వందల ఎకరాల సాగు
- నెలరోజుల పైరుకే ఎర్ర, తెల్ల చీడ
- ఆందోళనలో అన్నదాతలు


ఆయకట్టులో సాగు చేసిన వరి పంట


పంటకు సోకిన ఎర్రచీడ

నంబులపూలకుంట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): చీడపీడల ఉధృతితో రబీలో సాగు చేసిన వరి పంట దెబ్బతింటోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని వంకమద్ది చెరువు ఆయకట్టు కింద 365 ఎకరాల సాగుభూమి ఉంది. రబీలో మూడువందల ఎకరాల్లో వరి పంటను సాగుచేశారు. నంబులపూలకుంట, వంకమది, మరికొమ్మదిన్నె పంచాయతీ గ్రామాల రైతులకు ఇక్కడ భూములున్నాయి. ఒకసారి చెరువు నిండితే రెండు పంటలు సాగుచేసే అవకాశముంది. వర్షాకాలంలో కురిసిన వర్షాలకు సగం చెరువు నిండింది. ఈ చెరువుకు రెండు తూములున్నాయి. చెరువు పూర్తిగా నిండితే పెద్దతూముకింద కాలువలకు నీరు అందిస్తారు. ప్రస్తుతమున్న నీటి సామర్థ్యాన్ని బట్టి చెరువులో ఉన్న కింద తూము ద్వారా పంటలకు నీరు అందిస్తున్నాయి. ఆయకట్టు రైతులందరూ చర్చించుకుని, పంట సాగుకు నీరున్నాయని వరి పంటను సాగుచేశారు. వరి నాటి 30రోజులు గడుస్తోంది. కలుపు దశలో వరిపంటకు ఎర్ర, తెల్లచీడ సోకింది. కొనముడతపురుగు సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎండలు ముదురుతున్న సమయంలో వేడికి చీడ పీడలు సోకవనుకుంటే, అవి పంటలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎండ మరింత ముదిరితే అగ్గి తెగులు సోకే అవకాశం ఉన్న ట్లు వాపోతున్నారు. ఆయకట్టు వరి పంటలకు మందులు పిచికారీ చేయాలంటే, గట్లు చిన్నవిగా ఉంటాయి. భూములు ఆనుకుని ఉండటంతో ఒక పంటనుంచి మరోపంటకు చీడపీడలు వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది. రైతులందరూ మూకుమ్మడిని చీడపీడల నివారణకు మందులు పిచికారీ చేయాల్సి ఉంది.

### ఆయకట్టు సాగు

వంకమద్దిచెరువు ఆయకట్టు కింద ఒకసారి వరి పంట పండితే ఏ రైతు ఇంటిలో చూసినా తిండిగింజలకు లోటులేకుండా ఉంటుంది. నంబులపూలకుంట, వంకమద్ది, గురుకానివారిపల్లి, పెద్దరామయ్యగారిపల్లి, బందారచెట్లపల్లి, పోరెడ్డివారిపల్లి, గెలిచివారిపల్లి, మరికొమ్మెదిన్నె, నల్లగుట్లపల్లి గ్రామాలరైతులకు ఆయకట్టు కింద భూములున్నాయి. గత కొన్నేళ్లుగా వంకమద్దిచెరువు ఆయకట్టు కింద పంటల సాగు చేయడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇక్కడ భూమి లేని రైతులు కౌలుకు, గుత్తకు తీసుకుని వరి పంటను సాగు చేస్తున్నారు. ఎకరాకు 30నుంచి 40 బస్తాల దాకా దిగుబడి ఇచ్చే భూములు కావడంతో పంట సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఎంతో ఆశతో సాగుచేసిన వరి పంటకు నెలలోనే చీడపీడలు ఉధృతంగా ఆశించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటను కాపాడుకునేందుకు వ్యవసాయాధికారులు సూచనలు, సలహాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

### మందులు పిచికారీ చేయాలి: లోకేశ్వర్‌రెడ్డి, వ్యవసాయాధికారి

వరి పంటకు సోకిన చీడపీడల నివారణకు ఆలస్యం చేయకుండా రసాయన మందులు పిచికారీ చేయాలి. ఒకలీటర్ నీటికి 2గ్రా. ఆసిపేట్ లేదా రెండువందల లీటర్ల నీటిలో బ్యాక్టిరియోమైసిన్ 36గ్రా.కలిపి పిచికారీ చేస్తే చీడపీడలను నివారించవచ్చు.

### ఎర్రచీడ పట్టింది: నరసింహులు, వంకమద్ది



ఆయకట్టు కింద 80సెంట్ల విస్తీర్ణంలో వరి పంటను సాగుచేశా. ప్రసుత్తం కలుపు దశలో ఉంది. ఉదయం సమయంలో వరి పంటను పరిశీలిస్తే పచ్చగా కనిపిస్తుంది. చీడ, దోమలు కనిపించవు, ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో పంటను పరిశీలిస్తే ఎర్రమచ్చతెగుళ్లు బాగా కనిపిస్తాయి. నెల కిందట సాగు చేసిన పంటకు వ్యాధి సోకింది. వ్యవసాయాధికారులు ఏమందులు పిచికారీ చేయాలో తెలపాలి.

### ఏమి చేయాలో..: నరసింహులు, వంకమద్ది



ఎకరం పొలంలో రూ. 30వేలు ఖర్చు చేసి వరి పంటను సాగు చేశా. ఆయకట్టు కింద పంట బాగా పండితే ఎకరానికి 30నుంచి 40బస్తాలు పండుతాయి. వరి నాటి నెలదాటకనే రోగాలు ఆశించాయి. చీడపీడలు నివారించుకుని పంటను కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నాం. వేసవి కాలంలో వరి పంటకు చీడపీడలు వస్తున్నాయంటే ఏమిచేయాలో అర్థం కావడంలేదు.

## పది ఫలితాల్లో బీసీ హాస్టళ్లను టాప్‌లో నిలపడమే లక్ష్యం

- బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూకొఠారీ



అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బీసీ సంక్షేమ వసతిగృహాల్లోని పదో తరగతి విద్యార్థులను ఈ ఏడాది ఫలితాల్లో అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా పెట్టుకున్నామని బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూ కొఠారీ అన్నారు. అందుకోసం ఇప్పటికే యాక్షన్ ప్లాన్ రూపొందించుకుని, చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రతి విద్యార్థి పాసయ్యేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామంటున్న ఆమెతో ఇంటర్వ్యూ...

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

**ప్రశ్న:** వసతిగృహాల్లో మౌలిక వసతుల కల్పనకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు..?

**జవాబు:** జిల్లాలోని అన్ని వసతిగృహాల్లో శుభ్రతకు ప్రాధాన్యమిస్తున్నాం. పిల్లలకు అందించే భోజనం నాణ్యత విషయంలో రాజీ పడొద్దని వార్డెన్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం.

**ప్రశ్న:** పదో తరగతిలో వెనుకబడిన స్టూడెంట్స్ పరిస్థితేంటి..?

**జవాబు:** పదో తరగతిలో ఏ, బీ, సీ గ్రేడ్‌ల వారీగా విద్యార్థులను పరిశీలిస్తున్నాం. అందులో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాం. వారికోసం ఇద్దరు, ముగ్గురు ట్యూటర్లను పెట్టి సబ్జెక్టుల వారీగా శిక్షణ ఇస్తున్నాం.

**ప్రశ్న:** కొందరు వార్డెన్లు పిల్లలకు అరకొర భోజనం పెడుతున్నారన్న విమర్శలున్నాయి..?

**జవాబు:** జిల్లాలో విద్యార్థులకు మెనూ అమలు పరిచే విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని ఇప్పటికే వార్డెన్లకు ఆదేశాలు జారీ చేశాం. ఎక్కడైనా మెనూలో అలసత్వం వహించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తప్పవు.

**ప్రశ్న:** జిల్లాలో ఎఫ్ఆర్ఎస్ (ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్) పనితీరు ఎలా ఉంది?

**జవాబు:** జిల్లాలో గతేడాదే ఎఫ్ఆర్ఎస్ కోసం కొన్ని హాస్టళ్లను పైలట్‌గా తీసుకున్నాం. ఇప్పటి వరకూ 70 శాతం వరకూ సక్సెస్ ఫుల్‌గా సాగుతోంది. ఈ సంవత్సరం అన్ని హాస్టళ్లలో అమలు చేస్తున్నాం.

**ప్రశ్న:** సొసైటీ లోన్లకు సంబంధించి రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయా..?

**జవాబు:** ప్రస్తుతం సొసైటీ లోన్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు చేపట్టడం లేదు. రాష్ట్ర అధికారుల నుంచి ఆదేశాలు వస్తే.. కార్పొరేషన్ సహకారంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపడతాం.

## సీపీఎం నేత బడా సుబ్బిరెడ్డి కన్నుమూత

- కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటు
- నివాళి అర్పించిన నాయకులు


సుబ్బిరెడ్డి (ఫైల్)

కదిరి అర్బన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): సీపీఎం సీనియర్ నేత బడా సుబ్బిరెడ్డి (66) సోమవారం తెల్లవారుజామున కన్నుమూశారు. అనారోగ్యంతో కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొం దుతూ మృతిచెందారని ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామమైన కదిరి మండలంలోని వరిగిరెడ్డిపల్లికి తీసుకొచ్చారు. పలువురు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సుబ్బిరెడ్డి మృతి కమ్యూనిస్టు ఉద్యమలకు తీరని లోటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ తదితరులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుబ్బిరెడ్డి మృతి సీపీఎంకు, రైతు సంఘానికి తీరని లోటని అన్నారు. సుదీర్ఘకాలంగా రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై అనేక ఉద్యమాలు కొనసాగించారని గుర్తు చేసుకున్నారు. సీపీఎం సత్యసాయి జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడిగా, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నట్లు తెలిపారు. మృతుడి కు టుంబాన్ని పలువురు పరామర్శించారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శులు కేశవరెడ్డి, కదిరప్ప, సీపీఎం నాయకు డు జీఎల్ నరసింహులు, పలువురు నాయకులు నివాళి అర్పించారు.


మృతదేహంపై పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న జిల్లా నాయకులు

## చచ్చినా.. మారరు..!

అనంతపురం విద్య, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తన కుమారుడి మార్కుల జాబితా కోసం తండ్రి ఆత్మహత్య చేసుకోబోయాడు. చావుకు సిద్ధపడితేగానీ యాజమాన్యం స్పందించలేదు. నగర శివారులోని ఓ కార్పొరేట్ పాఠశాల వద్ద సోమవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. కంబదూరు మండలం రాళ్లపల్లికి చెందిన శ్రీనివాస్ కుమారుడు గత ఏడాది ఓ కార్పొరేట్ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసుకున్నాడు. ఫీజు పెండింగ్ ఉందంటూ అప్పట్లో ఏడాది టీసీ మాత్రమే ఇచ్చి, మార్కుల జాబితా ఇవ్వలేదు. ఏడాదిగా తిరుగుతున్నా కరుణించలేదు. ఇటీవల రాయదుర్గంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల వేదికలో డీఈఓ ప్రసాద్‌బాబుకు శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. అయినా ఫలితం లేకపోయింది. దీంతో ఆయన పురుగుల మందు డబ్బాతో పాఠశాల ఆవరణలోకి వెళ్లి ఆత్మహత్య చేసుకోబోయారు. పాఠశాల సిబ్బంది ఆయనను అడ్డుకుని పక్కకు తీసుకెళ్లారు. ఆ తరువాత మార్కుల జాబితాను ఇచ్చి పంపినట్లు తెలిసింది.

## చీనీ టన్ను రూ.22వేలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.22,050 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.5వేలు, సరాసరి రూ.11,500తో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 169 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

## న్యూస్ బాక్స్

### ఘనంగా శివలింగ ప్రతిష్ఠ

శింగనమల ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగులగుడ్డం గ్రామంలో శివలింగం ప్రతిష్ఠను సోమవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు ఉదయం నుంచి స్వామి వారికి అభిషేకం చేసి, హోమాలు నిర్వహించారు. అనంతరం శివలింగ ప్రతిష్ఠ చేశారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేపట్టారు.

### ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి : ప్రిన్సిపాల్

రామగిరి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మార్చి 1వ తేదీ నుంచి నిర్వహించే ఇంటర్ పరీక్షల కోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ సత్యనారాయణయాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షా కేంద్రాల్లో ప్రభుత్వ కళాశాల విద్యార్థులతో పాటు మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలల నుంచి మొదటి సంవత్సరం 247 మంది, రెండో సంవత్సరం 126 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు.

### నేడు రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు

రాప్తాడు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి కోసం సబ్సిడీ రుణాల మంజూరుకు మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు దరఖాస్తు ఫారం, ఆధార్, రేషన్‌కార్డు, కుల, ఆదాయియ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాసు పుస్తకం, జిరాక్స్ కాపీలను తీసుకుని రావాలన్నారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను బ్యాంకు మేనేజర్లు పరిశీలిస్తారన్నారు.

### 'చేనేత'కు రూ.2వేల కోట్లు కేటాయించాలి

● చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): చేనేతరంగం అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్‌లో రూ. 2వేల కోట్లు కేటాయించాలని చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డికి సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం శ్రీరాములు మాట్లాడు తూ గత వైసీపీ ప్రభుత్వంలో రాయితీ పథకాలను రద్దుచేసి చేనేతలను రోడ్డున పడేశారని మండిపడ్డారు. చేనేతల ఆత్మహత్యలపై చట్ట సభల్లో చర్చించకపోవడం అన్యాయమన్నారు. సుప్రీంకోర్టు కేటాయించిన 11రకాల రిజర్వేషన్ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలన్నారు. మంత్రి నారా లోకేష్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ. 36వేలు చొప్పున నేతన్న నేస్తం పథకాన్ని అమలు చేయాలని కోరారు. నాయకులు గోవిందు, రాధాకృష్ణ, గురుప్రసాద్, నాగరాజు, సుబ్రమణ్యం, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

### ప్రతిభకు చిరునామా జేఎన్టీయూ విద్యార్థులు

● వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు



విద్యార్థులను అభినందస్తున్న వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ క్రిష్ణయ్య

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): విద్యా, ఉద్యోగాలతోపాటు సాంస్కృతిక రంగాల్లోనూ జేఎన్టీయూ విద్యార్థులు ప్రతిభకు చిరానామాగా నిలిచారని వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన ఇంటర్ స్టేట్ యూత్ ఎక్స్చేంజ్ ప్రోగ్రామంలో పాల్గొన్న జేఎన్టీయూ ఎంబీఏ విద్యార్థులు ప్రతిభ చూపారు. విద్యార్థులు శ్రీనిధి, జాహ్నవిని సోమవారం వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ క్రిష్ణయ్య అభినందించారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి ప్రొఫెసర్ బి. చంద్రమోహన్ రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు బీసీ లక్ష్మన్న, జయరామిరెడ్డి, విశ్వనాథ్, జాకీర్ హుస్సేన్, శ్రవణ్‌కుమార్, శ్రీలత, రామకృష్ణ, సిబ్బంది ప్రసాద్, నగేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

### బైకు బోల్తా... ఉపాధ్యాయుడికి గాయాలు

గార్లదిన్నె, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుడ్డాలపల్లి వద్ద 44వ జాతీయ రహదారిపై సోమవారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడి ఉపాధ్యాయుడికి గాయాలయ్యాయి. ఆత్మకూరు మండలం తలుపూరులోని ఉన్నత పాఠశాలలో శ్రీనివాస్‌రావు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం పనినిమిత్తం ద్విచక్ర వాహనంలో పామిడికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం అదుపుతప్పింది. శ్రీనివాస్‌రావుకు గాయాలయ్యాయి. ఆయనను 108 వాహనం ద్వారా అనంతపురం ప్రభుతాస్పత్రికి తరలించారు.

### షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

కనగానపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నమనాయుని కోటలో సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఫ్యాన్లు, లైట్లు, గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. రూ 2 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. గ్రామానికి చెందిన చిన్నప్పయ్య తన ఇంటిలో నీళ్ల కాచుకునేందుకు వాటర్ హీటర్ వేశాడు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగి ఇళ్లంతా మంటలు చెలరేగాయి. ఇంట్లోని సామగ్రి పూర్తిగా కాలిపోయి, రూ.2 లక్షలు నష్టం జరిగిందని బాధితులు వాపోయారు.

### సైబర్ నేరాలపై అవగాహన

నార్పల, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలు, ఆన్‌లైన్ యాప్‌ల గురించి ప్రజలకు పోలీసులు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సాగర్ మాట్లాడుతూ సైబర్ మోసాలపై ప్రజలకు వివరించారు. ఒకవేళ సైబర్ క్రైమ్‌లో బాధితులయితే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1930 ఫిర్యాదు చేసి, నష్టపోయిన డబ్బును కొంతమేర తిరిగి పొందవచ్చని తెలిపారు. అత్యవసర సమయంలో డయల్ 100, 112 కాల్ చేయాలన్నారు, ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది దేవానంద, సుంకన్న, షైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడాపురానికి చెందిన నరసప్ప(68) చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్టు గ్రామస్థులు తెలిపారు. గ్రామానికి చెందిన నరసప్ప కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. వారం రోజులక్రితం స్థానికంగా ఓ రైతుకు చెందిన పొలంలో చింతకాయలు దులుపుతూ ప్రమాదవ శాత్తు కాలు జారి చెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతు మృతిచెందారన్నారు.

### టీడీపీ నాయకుడి మృతికి సంతాపం

శింగనమల, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెస్టు నరసాపురం ఎంపీటీసీ మాజీ సభ్యుడు, టీడీపీ సీనియర్ నాయకుడు లక్ష్మానాయక్ మృతి చెందాడు. నాగులగుడ్డం తండాకు చెందిన లక్ష్మానాయక్ కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి, మాజీ ఎంపీపీ ముత్యాలు, లక్ష్మీదేవమ్మ, సీనియర్ నాయకులు రాఘవరెడ్డి, మాసూలచంద్రమోహన్ తదితరులు ఆ గ్రామానికి వెళ్లి నివాళులర్పించారు.

# కైలాస వాహనంపై విశ్వేశ్వరుడు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు సోమవారం స్వామివారు కైలాస వాహనంపై ఊరేగారు. ఆలయంలో ఉదయం మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభి షేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించా రు. ఆలయ అనువంశీకుడు హోసూరు రామసు బ్రహ్మణ్యం స్వామివారికి 27 రుద్రాక్ష మాలలు, 25 స్ఫటికమాలలు సమర్పించారు. సాయంత్రం విశేషంగా అలంకరించిన కైలాస వాహనంపై విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి ఉత్సవమూ ర్తులను ఉంచి ఆ మాలలతో అలంకరించారు. మొదటి రోడ్డు, రెండో రోడ్డు మీదుగా ఊరేగిం చారు. కార్యక్రమంలో ఆలయ ఆలయ ఈఓ రమేష్‌బాబు, అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం, నరేంద్ర చౌదరి, శ్రీనివాసు లు, ఎర్రిస్వామి, పరమేష్, భక్తులు పాల్గొన్నారు.



కైలాస వాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవారు

### సహస్ర లింగార్చనకు తరలిరండి

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ని పురస్కరించుకుని శారదానగర్‌లోని శివబాలయోగి ఆశ్రమంలో బుధవారం చేపట్టే సహస్రలింగార్చనను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు జూటూరు అరవింద్ పిలుపునిచ్చారు. ఆలయ ఆవరణలో సోమవారం సాయంత్రం సహస్ర లింగార్చన బ్రోచర్లను ఆవిష్కరించారు. శివరాత్రి వేడుకల్లో భాగంగా ప్రత్యేకంగా ఒక్కో జంటచే 1116 లింగాలకు అభిషేకాలు చేయిస్తామని, భక్తుల సందర్శనార్థం ఆలయ ఆవరణలో ఆరడుగుల మంచు అమరనాథ లింగం, ఆరడుగుల సహస్ర లింగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాత్రికి జాగరణ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్లు తెలిపారు. భక్తుల స్వహస్తాలతో అనంత ఐశ్వర్యేశ్వరస్వామికి అభిషేకాలు చేయిస్తాబన్నారు. భక్తులు విరివిగా హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు రత్నగిరి దేవరాజు, కార్యదర్శులు మల్లికార్జున, వెంకట సురేష్‌కుమార్, కోశాధికారి ప్రసాద్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ బిల్లులకు మోక్షం



టీడీపీ హయాంలో నిర్మించిన ఎన్టీఆర్ ఇల్లు

● వైసీపీ హయాంలో ఆగిన ఎన్టీఆర్ హౌసింగ్ బిల్లులు
● 250 మంది లబ్ధిదారులకు రూ.86 లక్షలు పెండింగ్
● కూటమి రాకతో త్వరలో ఖాతాల్లోకి...

రాప్తాడు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన ఎన్టీఆర్ హౌసింగ్ పెండింగ్ బిల్లులకు మోక్షం కలిగింది. ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులు గత వైసీపీ ప్రభుత్వంలో బిల్లుల కోసం నిరీక్షించారు. అయినా అప్పటి ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవ డంతో నిరాశ చెందారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అప్పటి ఎన్టీఆర్ హౌసింగ్ పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు పెండింగ్ బిల్లులను పూర్తిగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 2014నుంచి 2019 వరకు గత టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్టీఆర్ హౌసింగ్ పేరుతో పేదలకు ఇళ్లు మంజూరు చేశారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ. 1.50 లక్షలు మంజూరు చేశారు. మొదటి దశలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు నిర్మాణాలు పూర్తి చేయడంతో వారికి బిల్లులు ఖాతాల్లో జమ అయ్యాయి. రెండో విడుతలో నిర్మించుకున్న కొంత మందికి బిల్లులు పూర్తి స్థాయిలో జమ కాలేదు. ఒక్కొక్కరికి రూ. వేలల్లో జమ కావాల్సి ఉంది. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎన్టీఆర్ హౌసింగ్ లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపు నిలిపి వేశారు. లబ్ధిదారులు హౌసింగ్ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఐదేళ్లు బిల్లులు జమ చేయలేదు. దీంతో లబ్ధిదారుల ఆందోళన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులు ఇక ఖాతాల్లో జమ కావని బిల్లుల గురించి అడగడం మానేశారు.

**రూ. 86 లక్షలు పెండింగ్**

2014 నుంచి 2019 వరకూ ఎన్టీఆర్ హౌసింగ్ పథకం కింద మండల వ్యాప్తంగా ఇళ్లు నిర్మించుకున్న 250 మంది లబ్ధిదారులకు రూ. 86 లక్షలు జమ కావాల్సి ఉంది. బండమీదపల్లిలో 20 మందికి, బోగినేపల్లిలో ఆరుగురు, బొమ్మేపర్తిలో ముగ్గురు, బుక్కచెర్లలో 11 మంది, ఎం. చెర్లోపల్లిలో 41, గాండ్లపర్తిలో 19 మంది, గొల్లపల్లిలో ముగ్గురు, గొందిరెడ్డిపల్లిలో 17 మంది, హంపాపురంలో 33, కొత్తపల్లిలో 10 మంది, మరూరులో ఆరుగురు, పాలచెర్లలో 21, ప్రసన్నాయపల్లిలో తొమ్మిది మంది, పుల్లలరేవులో ముగ్గురు, రాప్తాడులో 40, యర్రగుంటలో ఎనిమిది మంది చొప్పున మొత్తం 250 మందికి రూ. 86 లక్షలు జమ కావాల్సి ఉంది. 2024 ఎన్నికల్లో టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో పెండింగ్ బిల్లులను లబ్ధిదారుల ఖాతా ల్లో జమ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఉన్నతాధి కారుల ఆదేశాల మేరకు హౌసింగ్ అధికారులు లబ్ధిదారుల ఇళ్లను పరిశీలించారు.

**ఇంటి బిల్లు రూ.90 వేలు రావాల్సి ఉంది**



ఎన్టీఆర్ హౌసింగ్ పథకం ద్వారా నాకు గత టీడీపీ ప్రభుత్వంలో మంజూరైన ఇంటి నిర్మాణం సగం పూర్తయింది. ఆ తరువాత వైసీపీ ప్రభుత్వంలో మిగతా సగం పూర్తి చేశాను. వైసీపీ ప్రభుత్వంలో ఇంటి బిల్లు అడిగితే ఇవ్వమన్నారు. కూటమి అధికారం లోకి వచ్చింది. పెండింగ్ బిల్లుల ను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తామని హౌసింగ్ అధికారులు తెలిపారు.

\- కృష్ణయ్య, పుల్లలరేవు

**త్వరలోనే ఖాతాల్లో జమ అవుతాయి**

రాప్తాడు మండలంలోని 16 పంచాయతీల్లో 250 మంది ఎన్టీఆర్ హౌసింగ్ లబ్ధిదారులకు మొత్తం రూ.86 లక్షల పెండింగ్ బిల్లులు వారి ఖాతాల్లో జమ కావాల్సి ఉంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లబ్ధిదారుల ఇళ్లు పరిశీలించాం. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే వారి ఖాతాల్లో జమ అవుతాయి.

\- లావణ్య, హౌసింగ్ ఏఈఈ, రాప్తాడు.

### పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి: సీపీఐ

నార్పల,ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు పాలెం నారాయణస్వామి, తలారి నారాయణ స్వామి మాట్లాడారు. ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి చాపల రామాంజి, నాయకులు నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పెద్ద పెద్దయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి లలితమ్మ తదితర నాయకులు పాల్గొన్నారు.

● శింగనమల: అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నప్పయాదవ్ డిమాడ్‌చేశారు. సోమవారం శింగనమల తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ నాయకులు ధర్నా చేశారు. తహసీల్దార్ సాకే బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. నాయకులు మధు యాదవ్, వెంకటరెడ్డి, నారప్ప, నేసే మధు, ఓబిలేసు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### సీమ ప్రాజెక్టులకు రూ.10 వేల కోట్లు ఇవ్వాలి

అనంతపురం విద్య, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రాయలసీమ ప్రాజెక్టులకు బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆ సంఘం నాయకులు బుధవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ... సీమ జిల్లాల్లో 90 లక్షల ఎకరాల సాగు భూమి ఉందన్నారు. ప్రాజక్టులు పూర్తయితే 60 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. సంఘం నాయకులు రామకృష్ణ, నీలపాల రామకృష్ణ రామాంజినేయులు, శ్రీకాంత్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ఆహార భద్రత శాఖాధికారుల తనిఖీలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గుత్తి, పామిడి ప్రాంతాల్లోని హోటళ్లు, పాల తయారీ కేంద్రాల్లో జిల్లా ఆహారభద్రత శాఖాధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆహారభద్రతా అధికారి తస్లీమ్ సోమవారం ఆ శాఖ సిబ్బందితో కలిసి గుత్తి పరిధిలోని కాశేపల్లి టోల్‌ప్లాజా వద్దనున్న న్యూ అమోఘ్ రెస్టారెంట్‌లో తనిఖీలు నిర్వహించారు. వంటగదిలో అపరిశుభ్రతను గుర్తించి నోటీసులు జారీచేశారు. అనంతరం పామిడి మండలం గజరాంపల్లి వద్దనున్న శ్రీరంగం మిల్క్ ప్రొడక్ట్స్ లిమిటెడ్‌లో తనిఖీలు నిర్వహించారు. అనుమానితంగా ఉన్న ఆవు పాలను సేకరించి ల్యాబ్‌కు తరలించినట్లు అధికారి తస్లీమ్ తెలిపారు.

## సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

● ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న ఎంపీ అంబికా

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): అధునాత శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు అందిపుచ్చుకోవాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సూచించారు. మండలంలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞానకేంద్రంలో సోమవారం పీఎం కిసాన్ సమ్మాన్ సమ్మేళనం నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ 19వ పీఎం కిసాన్ సమ్మాన్ సమ్మేళన్ కింద దేశవ్యాప్తంగా 9.26 కోట్ల మంది రైతులకు రూ.20వేల కోట్లు ఇచ్చినట్లు తెలిపారు. జిల్లాలో రూ.2.85లక్షల మంది రైతులకు రూ.57కోట్ల పీఎం కిసాన్ సొమ్మును వారి ఖాతాలో జమ చేసినట్లు వెల్లడించారు. సన్నకారు రైతులకు ప్రతి ఏటా కేంద్ర ప్రభుత్వం రూ.6వేలు, కూటమి ప్రభుత్వం రూ.9 వేలు ఇస్తాయన్నారు. వ్యవసాయంలో ఎదురవుతున్న సమస్యల్ని అధిగమించి, మెరుగైన దిగుబడులు సాధించేలా శాస్త్రవేత్తలు పరిశోధనలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానంతో సేద్యంలో మార్పులు వస్తున్నాయన్నారు. రైతులు అందుకనుగుణంగా సాగు విధానాలు అవలంభించాలన్నారు. కేవీకే ప్రధాన శాస్త్రవేత్త మల్లీశ్వరీ, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, ఏపీఎంఐపీ పీడీ రంగనాథ్‌రెడ్డి, ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ మద్దిలేటి, శాస్త్రవేత్తలు భార్గవి, వసుంధ, సుధారాణి, శశికళ, మాధవి పాల్గొన్నారు.

### నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు

● వంటగ్యాస్ ఏజెన్సీలకు జేసీ హెచ్చరిక

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వంట గ్యాస్ ఏజెన్సీలపై చర్యలు తప్పవని జాయింట్ కలెక్టరు శివనారాయణ్‌శర్మ హెచ్చరించా రు. ఆయన సోమవారం పౌర సరఫరాల శాఖ అధికారులు, విజిలెన్స్ అధికారులు, ఆయిల్‌కంపెనీలు, గ్యాస్ ఏజెన్సీలతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించి మట్లాడారు. దీపం పథకం కింద అర్హులైన వారందరికీ ఉచితంగా గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయాలన్నారు. అలాగే ఉచిత గ్యాస్ సరఫరా సమయంలో డెలవరీబాయ్స్ అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయన్నారు. ఇప్పటికే అనేకసార్లు హెచ్చరించామని ఇకఅలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఐవీఆర్ఎస్ సర్వేలోనే గ్యాస్ ఏజెన్సీల పనితీరు ఆశించినంత కనబడడం లేదని, మెరుగుపరచుకోవాలని సూచించారు. ఇన్‌చార్జ్ డీఎస్ఓ జగన్మోహన్‌రావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### అగ్నికి ఆహుతైన అరటి తోట

ఆత్మకూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తన రెండున్నర ఎకరాల అరటితోట సోమవారం ప్రమాదవశాత్తు కాలిపోయినట్లు మండల కేంద్రానికి చెందిన మాధవరెడ్డి అనే రైతు తెలిపారు. దీంతో దాదాపు రూ. 8.5లక్షల వరకు నష్టం వాటిల్లిందని వాపోయాడు. రెండురోజుల్లో పంట విక్రయించాల్సి ఉండగా ప్రమాదం చోటు చేసుకున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. పంటతో పాటు డ్రిప్ పైపులు కాలిపోయాయన్నారు. హార్టికల్చర్ అధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

### శివుడికి షెడ్డు నిర్మాణం

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ఓ భక్తుడి సహకారంతో మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయ గోపురం వద్ద ఉన్న శివుడి ప్రతిమకు షెడ్డు నిర్మాణం చేపట్టారు. ఆ విగ్రహం ఎండ, వాన నుంచి ఎలాంటి రక్షణ లేదు. దీంతో రెండో రోడ్డులో నివాసముంటున్న గొంది ఆదిశేషయ్య అనే భక్తుడు శివుడి విగ్రహంపై షెడ్డు నిర్మాణం కోసం రూ. 80 వేలు వెచ్చించి షెడ్డు నిర్మించారు. సోమవారం దాతను ఆలయ ఈఓ రమేష్‌బాబు స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో జిజే వేణు, నరేంద్ర చౌదరి, ఎర్రిస్వామి, రాజు, చంద్ర పాల్గొన్నారు.

## కార్మికులను పర్మినెంట్ చేయాలి

● సీఐటీయూ, ఏఐటీయూసీ డిమాండ్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని మున్సిపల్ వర్కర్ల యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు అధ్యక్షతన సోమవారం మున్సిపల్ ఆర్డీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం, సీఐటీ యూ నగర కార్యదర్శి వెంకటనారాయణ మాట్లాడారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే కార్మికులందరూ సమ్మె బాట పడతామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ ఆర్డీ విశ్వనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో బండారు స్వామి, సాకే తిరుమలేశు, లక్ష్మీనరసమ్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**ఏఐటీయూసీ ఆధ్వర్యంలో...** మున్సిపల్ కార్మికుల సమస్యలపై సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నగరపాలిక ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి మాట్లాడారు. కార్మికుల సమస్యలను అసెంబ్లీలో చర్చించి న్యాయమైన వారి డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు. ఈనెల 6వ తేదీ చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ నాయకులు రాజేష్‌గౌడ్, కృష్ణుడు, జిల్లా అధ్యక్షుడు చిరంజీవి, వేణుగోపాల్, నాగేంద్రబాబు, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రమణీయం.. కోన కణ్వాశ్రమం



ఆశ్రమ ప్రాంతంలోని కణ్వమహర్షి విగ్రహం

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పచ్చని ప్రకృతి రమణీయ దృశ్యాలతో పులకిస్తోంది కోనకణ్వాశ్రమం. ఉమ్మడి జిల్లాలో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది. దీనిని న్యామద్దల కోన, గుట్టూరు కోన అని కూడా పిలుస్తారు. కణ్వమహర్షి తపస్సు చేసిన స్థలం కావున కోన కణ్వాశ్రమం అనే పేరు వచ్చినట్టు పెద్దలు చెబుతుంటారు. ఈ క్షేత్రంలో ప్రముఖంగా మల్లేశ్వరస్వామి, పాండురంగస్వామి, అయ్యప్పస్వామి ఆంజనేయ స్వామి ఆలయాలు ఉన్నాయి. మాతృశ్రీ ఆంజనాదేవి సమాధి, నాగుల కట్ట, ధ్యాన మందిరం ప్ర ముఖంగా ఉన్నాయి. ఇక్కడ నిత్యాన్నదానం కొనసాగిస్తున్నారు. ప్రతిఏటా మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ఈ మేరకు బుధవారం నుంచి రెండు రోజులపాటు జరిగే ఉత్సవాలకు ఆశ్రమ అధ్యక్షుడు శ్రీదత్తానందగిరి స్వామి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. బుధవారం శివపార్వతుల కల్యాణోత్సవంతో పాటు రెండో రోజు గురువారం సమారాధనతో ఉత్సవాలు ముగుస్తాయి. ఈ ఉత్సవాలకు భక్తులు పెద్దఎత్తున తరలివస్తారు.



కోనలోని మల్లేశ్వర లింగం

### భార్య ఆత్మహత్య కేసులో భర్తకు రిమాండ్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): భార్య ఆత్మహత్య కేసులో భర్తను పోలీసులు రిమాండ్‌కు పంపారు. అహుడా ప్లానింగ్ సెక్రటరీగా పనిచేస్తున్న నాగశ్రీ మూడు రోజులు కిందట ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. అయితే ఆత్మహత్యకు మునుపు ఆమెపై దాడి చేశాడనే కారణంతో ఆమె భర్త ద్వారకేశ్వరరావును నాలుగో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

### అనర్హత నుంచి తప్పించుకునేందుకు...
## జగన్ అసెంబ్లీకి..: ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అనర్హత నుంచి తప్పించుకునేందుకే జగన్ అసెంబ్లీకి వచ్చారని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారంలో ఉన్నప్పుడు అహంకారంతో, స్వార్థపూరిత పాలన సాగించిన జగన్‌రెడ్డిని ప్రజలు 11 స్థానాలకే పరిమితం చేసినా, ఆయన తీరులో మార్పు రాలేదన్నారు. జగన్‌ను నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు ఆయన ఏం చేస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న కూటమి ప్రభుత్వంపై నిత్యం అసత్యప్రచారం, విమర్శలు చేస్తూ ఏదో ఒక అలజడి సృష్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఆయనకు ప్రజలు, ప్రజాస్వామ్యం, ఎన్నికల కమిషన్ నిబంధనలన్నా లెక్కలేదన్నారు. ప్రజలు వైసీపీకి ప్రతిపక్ష హోదా లేకుండా చేసినా ఇంకా బుద్ది రాలేదన్నారు. ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటూ గవర్నర్ ప్రసంగానికి అడ్డుపడటం ఏమిటని నిలదీశారు. అసెంబ్లీలో వైసీపీ ఎమ్మెల్యేల వ్యవహార శైలి వారి దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ప్రజలపై వారికి ఏ పాటి చిత్తశుద్ధి ఉన్నా అసెంబ్లీలో ఉండేవారన్నారు. సభ్యత్వాలు రద్దు అవుతాయని, హాజరు కోసం అసెంబ్లీకి వచ్చినట్లు ఉందని విమర్శించారు.

### శివాలయాల వద్ద సౌకర్యాలు కల్పించండి: మేయర్



మొదటి రోడ్డు శివాలయంలో మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రిని పురస్కరించుకుని శివాలయాల వద్ద సౌకర్యాలు కల్పించాలని నగర మేయర్ మహమ్మద్ వసీం ఆదేశించారు. సోమవారం నగరంలోని మొదటిరోడ్డు శివాలయాన్ని మేయర్ వసీం సోమవారం సందర్శించారు. శివరాత్రి వేడుకల సందర్భంగా పారిశుధ్య నిర్వహణ, లైటింగ్, తాగునీటితో పాటు అవసరమైన ఏర్పాట్లు అన్నీ పూర్తి చేయాలని సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్పొరేటర్లు శ్రీనివాసులు, కమల్ భూషణ్, ఎంహెచ్‌ఓ విష్ణుమూర్తి, ఈఓ రమేష్‌బాబు, ఆలయ ప్రతినిధులు నరేంద్రచౌదరి, రాజు, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

### చెత్త పారబోసి కార్పొరేటర్ నిరసన



రోడ్డుపై చెత్త వేస్తున్న కార్పొరేటర్

నడిరోడ్డుపై చెత్త పారబోసి 14వ డివిజన్ కార్పొరేటర్ అబూ సాలెహ నిరసన వ్యక్తం చేశారు. తన డివిజన్‌లోని తన ఇంటి నుంచి సోమవారం ఉదయం బయటకు వచ్చిన ఆయన డస్ట్ బిన్‌లో నుంచి చెత్తను రోడ్డుపై పడేశారు. చెత్త సేకరణకు ఏ వాహనం రాకపోతే ఎలా అంటూ ప్రశ్నించారు. ఇంటింటి చెత్త సేకరణ సరిగా చేయకపోతే ప్రజల సహకారంతో చెత్తను నగర పాలక సంస్థ కార్యాలయంలో వేస్తానని హెచ్చరించారు.

### శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

ఆత్మకూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ముస్లింల శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి సోమవారం టీడీపీ మండల నాయకులు భూమి పూజ చేశారు. గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి హామి పూజ చేసి వదిలేశారని, ప్రస్తుం కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే పరిటాల సునీత నిధులు మంచూరు చేయించినట్లు టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలనాయకులు కందుళ ఓబుళపతి, రామదాసు, అక్కులన్న, బాబయ్య, చికెన్ వలి, గుజరీ రఫి, ఆదెప్ప, శ్రీనివాసులు, రసూల్, తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

### 15 మంది బైండోవర్

కూడేరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడదరకుంట గ్రామంలో భూ వివాదంలో దళితులు, బీసీల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడంతో అందులో ఒక వర్గం వారిని 15 మందిని బైండోవర్ చేశారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ వినూత్న ఎదుట బీసీ వర్గానికి చెందిన కురుబ తుప్పటి ఈశ్వరయ్యతోపాటు మరో 14 మందిని హాజరుపరచి బైండోవర్ చేశామని సీఐ రాజు తెలిపారు. మరో వర్గాన్ని త్వరలోనే హాజరు పరుస్తామని పేర్కొన్నారు.

### అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఏఐటీయూసీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ నయీమ్ అహ్మద్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. తర్వాత పలువురు నాయకులు మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించకపోతే మార్చి3న చలో కలెక్టరేట్, అదేనెల 6న చలో విజయవాడ కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఏఐటీయూసీ కార్యదర్శి ఈశ్వరయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి నరసయ్య, అధ్యక్షుడు కొండయ్య, నాయకులు పాల్గొన్నారు.

### మౌలిక వసతులు కల్పించాలని వినతి

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆలూరు రోడ్డులో గల సీఐటీయూ కాలనీలో మౌలిక వసతులను కల్పించాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం కమిషనర్ నయీమ్ అహ్మద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పలువురు మాట్లాడుతూ.. కాలనీలో సీసీ రోడ్లు, తాగునీటిపైపులైను, డ్రైనేజీలను ఏర్పాటు చేయాలని కోరారు. సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్, నాయకులు చంద్రశేఖర్, అబ్దుల్లా, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

### విత్తన జొన్న పంటల పరిశీలన

ఆంధ్రజ్యోతి స్పందన

విడపనకల్లు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని హావళిగి గ్రామంలో రైతులు సాగు చేసిన విత్తన జొన్న పంటను వ్యవసాయాధికారి పెన్నయ్య సోమవారం పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ.. జొన్న విత్తనం (సీడ్ జొన్న)ను సాగు చేసే ముందు విత్తనాన్ని ఇచ్చిన కంపెనీల వద్ద తప్పని సరిగా అగ్రిమెంట్ చేయించుకోవాలని సూచించారు. రైతులు ఏ కంపెనీవారితోనూ అగ్రిమెంట్ చేయించుకోకపోవటంతో పండించిన పంటలు మొత్తం అలాగే ఉండి పోయాయని అన్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారులతో చర్చించి విత్తన జొన్న సాగు చేసిన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ రాఘవేంద్ర, గ్రామ రైతులు పాల్గొన్నారు. విత్తన జొన్నకు గిట్టుబాటు ధర లేక వాటిని అమ్ముకునేందుకు రైతులు ఇబ్బంది పడుతుండడంపై ఇటీవల ఆంధ్రజ్యోతిలో తక్కువధరకే తెగనమ్ముకుంటున్నారు అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు ఏఓ స్పందించి గ్రామానికి వెళ్లి రైతులతో మాట్లాడారు.

### షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

తాడిపత్రి, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుక్కలూరు గ్రామంలో సోమవారం షార్ట్‌సర్క్యూట్‌తో హాజీవలికి చెందిన ఇల్లు దగ్ధమైంది. హాజీవలి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కాగా అతడి ఇంటిలో ఇన్వర్టర్ వద్ద షార్ట్‌సర్క్యూట్ కావడంతో మంటలు వ్యాపించాయి. దీంతో ఫ్రిడ్జ్, టీవీ, 10 ప్యాకెట్ల బియ్యం, బట్టలు, బీరువాలో ఉన్న విలువైన పత్రాలు దగ్ధమయ్యాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. విషయం తెలుసుకున్న హాజీవలి ఇంటికి చేరుకొని విలపించాడు. అప్పటికే అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో రూ.4లక్షలు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయారు.

### ఆదర్శ పాఠశాలలో ఇంటర్ పరీక్ష కేంద్రం

యాడికి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మార్చి 1వ తేదీ నుంచి నిర్వహించే ఇంటర్ పరీక్షలకు సంబంధించి ఆదర్శ పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ మారుతి సోమవారం తెలిపారు. పరీక్షల నిర్వహణకు ఇక్కడ అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

### ప్రజాసమస్యల పరిష్కార వేదికకు అధికారుల డుమ్మా

● కొందరు మాత్రమే హాజరు

శెట్టూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు చాలామంది అధికారులు గైర్హాజరయ్యారు. కేవలం తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ, అటవీశాఖ, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో పాటు ఉపాధి ఏపీఎం మాత్రమే హాజరయ్యారు. మిగిలిన శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. దీంతో వివిధ సమస్యల పరిష్కారం కోసం గ్రామాల నుంచి వచ్చిన చాలామంది ప్రజలు ఆయా శాఖల అధికారులు లేనిది చూసి నిరాశతో వెనుదిరిగి వెళ్లారు. ప్రతివారమూ ఇలాగే చాలా మంది అధికారులు డుమ్మాకొడుతున్నారని, ఇలా అయితే సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని ప్రజలు ఆవేదన చెందారు. జిల్లా అధికారులు స్పందించి అన్ని శాఖల అధికారులు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

### ఆదుకోవాలని తహసీల్దార్‌కు వినతి

శెట్టూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బలపంపల్లిలో పెంసాని నాగరాజు అనే రైతుకు సంబంధించిన డ్రిప్ పరికరాలు, 50 మామిడి చెట్లు గత ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో ఆహుతయ్యాయి. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయాయని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ సోమవారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టికి వినతిపత్రం అందించారు.

### యూనిక్ ఐడీ కోసం రైతుల నిరీక్షణ

ఉరవకొండ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఏపీ ఫార్మర్ రిజిస్ట్రేషన్ కోసం సర్వర్ సక్రమంగా పని చేయకపోవడంతో రైతుల గంటల తరబడి కార్యాలయం వద్ద నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. పట్టణంలోని ఉద్యానవన కార్యాలయంలో సోమవారం యూనిక్ ఐడీ నెంబర్ కోసం రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కాగా యూనిక్ నెంబర్ కేటాయింపు ప్రక్రియ మందకొడిగా సాగింది. సర్వర్ మొరాయిస్తుండడంతో రైతులు గంటల పాటు వేచి చూడాల్సివచ్చింది. యూనిక్ ఐడీ నెంబర్ మూడు దశల్లో పూర్తి చేయాల్సి ఉండగా.. కేవలం రెండు దశలు మాత్రమే చేస్తున్నారు. మండలంలో 9,341మంది రైతులు ఉండగా ఇప్పటి వరకూ 600మంది రైతులకు మాత్రమే యూనిక్ ఐడీ నెంబర్లు కేటాయించారు. మరో 800మంది రైతులకు రెండు దశలు మాత్రమే పూర్తి చేశారు. సర్వర్ పనిచేయకపోవడం వల్లే జాప్యం జరుగుతోందని ఏఓ తెలిపారు.



కార్యాలయంలో వేచి ఉన్న రైతులు



ఉద్దేహాళ్‌లో ఓ వాహనంలోకి పరిమితికి మించి కూలీలను ఎక్కిస్తున్న దృశ్యం





బొలెరో, ఆటో వాహనాల్లో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న కూలీలు

# కూలీల ప్రాణాలతో చెలగాటం..!

● ప్రైవేట్ వాహనాల్లో పరిమితికి మించి తరలింపు
● ప్రమాదపుటంచున ప్రయాణం

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కూలీల ప్రాణాలతో ప్రైవేటు వాహనదారులు చెలగాటం ఆడుతున్నారు. పరిమితికి మించి కూలీలను ఎక్కించుకుని, మితిమీరిన వేగంతో వెళ్తున్నారు. మండలంలోని ఉద్దేహాళ్, శ్రీధరఘట్ట, ఉప్పరహాళ్, గౌనూరు తదితర గ్రామాల నుంచి నిత్యం మిరప కూలీలు కర్ణాటక ప్రాంతాలకు వెళ్తుంటారు. ప్రైవేటు వాహనదారులు నిబంధనలకు నీళ్లొదిలి పరిమితికి మించి కూలీలను ఎక్కించుకుని వెళ్తున్నారు. ఫలితంగా గతంలో అనేక ప్రమాదాలు జరిగాయి. అయినా వారిలో మార్పు రాలేదు. వారిపై చర్యలు తీసుకునే వారు కరువవడంతో ఆటోవాళ్లదే ఇష్టారాజ్యంగా మారింది. ఆటోలకు సరైన పత్రాలు, డ్రైవర్లకు లైసెన్సులు కూడా లేకపోవడంతో ప్రమాదాల బారిన పడినా వారికి బీమా కూడా అందడం లేదు. దీనికి తోడు కొంతమంది డ్రైవర్లు మద్యం సేవించి, వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. మరికొంతమంది చిన్న వయసులోనే మితిమీరిన వేగంతో వాహనాలను నడుపుతూ నియంత్రించలేక ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఇప్పటికైనా సంబంధితాధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా వాహనాల రాకపోకలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### కూలిరేట్లు పెంచాలని బీడీ కార్మికుల ర్యాలీ



వినతిపత్రం అందజేస్తున్న బీడీ కార్మికులు, నాయకులు

తాడిపత్రి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తమకు కూలిరేట్లు పెంచడంతో పాటు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ పట్టణంలోని బీడీ కార్మికులు సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. కార్యక్రమానికి బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం బీడీ కార్మికులకు గుర్తింపుకార్డులు మంజూరు చేయాలన్నారు. స్థలాలు ఇవ్వడంతోపాటు ఇంటినిర్మాణం చేసి ఇవ్వాలన్నారు. పీఎఫ్ వర్తింపజేయడంతోపాటు ఈఎస్ఐ ఆసుపత్రుల్లో వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. ఇప్పటి నుంచి ప్రతి ఆరునెలలకు ఒకసారి కూలీరేట్లు పెంచేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్‌చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రంను తహసీల్దార్ రజాక్‌వలికి అందజేశారు. ధర్నాలో బీడీకార్మిక సంఘం పట్టణ కో కన్వీనర్ రవి కుమార్, నాయకులు సూరి, ఉమాగౌడ్, నరసింహారెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### వ్యవసాయానికి సరఫరా కాని విద్యుత్

● దేవగిరి గ్రామంలో ఐదురోజులుగా ఇదే పరిస్థితి
● పంటలు ఎండుతున్నాయని రైతుల ఆందోళన

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవగిరి గ్రామంలోని వ్యవసాయ మోటార్లకు త్రీఫేస్ కరెంట్ గత ఐదురోజులుగా సరఫరా కావడం లేదు. దీంతో నీరు లేక పంటలు ఎండుతున్నాయని ఆ గ్రామానికి చెందిన రైతులు సంజప్ప, రవి, ఆంజనేయులు, శ్రీరాములు, నాగరాజు తదితరులు సోమవారం వాపోయారు. బొమ్మనహాళ్ సబ్ స్టేషన్ నుంచి త్రీఫేస్ కరెంట్ అందిస్తున్నారని, అయితే లోడ్ ఎక్కువ కావడం వల్ల విద్యుత్ సరఫరా కాకుండా పోతోందని అన్నారు. గోవిందవాడ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్‌ను సరఫరా చేసేందుకు స్తంభాలు ఏర్పాటు చేసి లైను ఇవ్వకుండా విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. సమస్య విన్నవించేందుకు ఐదు రోజుల నుంచి విద్యుత్ కార్యాలయానికి వెళ్లినా అక్కడ అధికారులు అందుబాటులో ఉండడం లేదని, దీంతో తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని వాపోయారు. వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా లేకపోవడం వల్ల మొక్కజొన్న, వేరుశనగ, అలసంద తదితర పంట లు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి పంటలు ఎండకుండా వ్యవసాయ మోటార్లకు కరెంట్‌ను సక్రమంగా సరఫరా చేయాలని వారు కోరారు.

### పోక్సో కేసు నమోదు

బెళుగుప్ప, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యలగలవంక తండాకు చెందిన ఓ యువతిని పెళ్లి చేసుకుంటానని మోసగించడం తో రాయదుర్గం మండలం రాతిబావివంకకు చెందిన వ్యక్తిపై సోమవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

### ఐదో రోజూ.. జ్ఞానజ్యోతి

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు సోమవారం ఐదో రోజూ జ్ఞానజ్యోతి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో తహసీల్దార్ మునివేలు మాట్లాడుతూ .. చిన్నారుల బాగోగులు అంగన్‌వాడీ కార్యకర్తల చేతిలోనే ఉంటుందన్నారు. చిన్నారులు తల్లి ఒడి నుంచి మీ చెంతకే వస్తారని, వారిని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓలు వీరన్న, మల్లికార్జున, సూపర్‌వైజర్లు , మండలవ్యాప్తంగా అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

### హుండీల కానుకల లెక్కింపు

పెద్దపప్పూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని అశ్వత్థ నారాయణస్వామి, చక్రస్థాపిత భీమలింగేశ్వరస్వామి ఆలయాల్లో హుండీల కానుకల్ని సోమవారం అధికారులు లెక్కించారు. తాత్కాలిక హుండీ నుంచి రూ.6,63,981, శాశ్వత హుండీ నుంచి రూ.3,64,084, శీఘ్రదర్శనం టికెట్ల ద్వారా రూ.1,92,050, తలనీలాల నుంచి రూ.24,850, అభిషేకం టికెట్ల నుంచి రూ.500, ఆలయ చందాల ద్వారా రూ.24732 చొప్పున మొత్తం 12,70,031 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఈఓ సుబ్రమణ్యం తెలిపారు.

### ముగిసిన ఇంటర్వ్యూలు

గుంతకల్లుటౌన్,ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ల కింద సబ్సిడీ రుణాల కోసం నిర్వహించిన ఇంటర్వ్యూలు సోమవారం ముగిశాయి. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5గంటల వరకు 21నుంచి 37వార్డుల అభ్యర్థులకు ఇంటర్వ్యూలను నిర్వహించారు. మొత్తం 1232 మంది దరఖాస్తు చేసుకోగా 1192 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని కమిషనర్ నయీమ్ అహ్మద్ తెలిపారు.

### సైబర్ నేరాల పట్ల అవగాహన

బొమ్మనహాళ్/ రాయదుర్గం రూరల్ ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీలో విద్యార్థులకు సోమవారం పోలీసులు సైబర్‌నేరాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ హనుమంతరెడ్డి మొబైల్ వాహనంలో డిజిటల్ స్క్రీన్ ద్వారా వాటి పట్ల అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్‌లు కమలమ్మ, మోహన్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ నరేంద్ర పాల్గొన్నారు. అలాగే రాయదుర్గం పట్టణంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సీఐ జయనాయక్ సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

### అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో గేట్స్ విద్యార్థుల ప్రతిభ

గుత్తి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని గేట్స్ కళాశాల విద్యార్థులు హైదరాబాద్‌లోని మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ ఆన్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ మిషన్ లర్నింగ్ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ అనే కాన్ఫరెన్స్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేపర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. నాలుగో సంవత్సరం ఈసీఈ విద్యార్థులు అరవింద్‌కుమార్, గణేష్‌రెడ్డి ఐఓటీ బెస్ట్ స్మార్ట్ హెల్మెట్ ఫర్ బైక్ ట్యాక్సీ రైడర్ అనే పేపర్ ప్రజంటేషన్ ఇచ్చి ఉత్తమ అవార్డు పొందినట్లు కరెస్పాండెంట్ పద్మావతమ్మ తెలిపారు. ఇందుకు సోమవారం ఆ విద్యార్థులను కరెస్పాండెంట్‌తో పాటు డైరెక్టర్ శ్రీవాణి, ఎండీ రఘునాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్, హెచ్ఓడీ ప్రవీణ్ అభినందించారు.

### టెన్త్ విద్యార్థులకు కెరీర్‌పై గైడెన్స్

తాడిపత్రి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేజీబీవీ, ప్రకాశం మున్సిపల్ ఉన్నత, మైనార్టీ పాఠశాలల్లో సోమవారం అర్జాస్ స్టీల్‌ప్లాంట్ వారు పదో తరగతి విద్యార్థులకు కెరీర్‌పై డిజిటల్ విధానంలో గైడెన్స్ ఇచ్చారు. ఈ సందర్భంగా భవిష్యత్తు కౌన్సిలింగ్ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ రామాంజనేయులు, సీనియర్ కౌన్సిలర్ బయపరెడ్డి మాట్లాడుతూ 10వ తరగతి అనంతరం విద్యార్థులు ఎలాంటి కోర్సులను ఎంచుకోవాలి, ప్రవేశపరీక్షలను ఎలా రాయాలి, తమ భవిష్యత్తును ఎలా మలచుకోవాలో వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసులు, ఎస్ఓ పద్మావతి పాల్గొన్నారు.

### సదరం సర్టిఫికెట్ల పరిశీలన

ఉరవకొండ,ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీహెచ్‌సీలో సోమవారం వికలాంగుల సదరం సర్టిఫికెట్లను పరిశీలించారు. ఆర్థోపెడిక్ డాక్టర్ లక్ష్మీరామ్ సర్టిఫికెట్లను పరిశీలించి ఎంత శాతం వికలత్వాన్ని నమోదు చేశారో గుర్తించారు. గత వైసీపీ హయాంలో అనర్హులకు పింఛన్లు ఇచ్చారన్న నేపథ్యంలో ప్రభుత్వం వారిని తొలగించడానికి ప్రత్యేకంగా చర్యలు తీసుకుంది. అందులో భాగంగా స్థానిక ఆసుపత్రిలో బూదగవి, అమిద్యాల గ్రామాలకు చెందిన వికలాంగ పింఛన్‌దారుల సర్టిఫికెట్లను పరిశీలించారు. మొత్తం 50మంది వికలాంగుల సర్టిఫికెట్లను పరిశీలించారు.

### పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి: సీపీఐ

పెద్దవడుగూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇళ్లు లేని పేదలకు ఇంటి స్థలం కేటాయించి గృహాలు నిర్మించాలని కోరుతూ మండలకేంద్రంలో సీపీఐ నాయకులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. మండల కార్యదర్శి వెంకటరాముడుయాదవ్, సీనియర్ నాయకుడు సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో చాలామంది నిరుపేదలు ఇళ్లు లేక, అద్దె గృహాల్లో నివాసం ఉంటున్నారన్నారు. ప్రభుత్వం అర్హులకు గ్రామాల్లో మూడు, పట్టణాల్లో రెండు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు. అలాగే ఇళ్ల నిర్మాణానికి సామగ్రితోపాటు రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు హుస్సేన్‌పీరా, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో ఇరుముడి


గుత్తి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నగరేశ్వర, కాశీవిశ్వేశ్వర ఆలయాల్లో సోమవారం శివమాలధారులు ఇరుముడి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకుల చేత ఇరుముడి కట్టించుకుని అనంతరం శ్రీశైలానికి బయలుదేరి వెళ్లారు. అంతకుమునుపు ఆలయాల్లో మూలవిరాట్‌లకు ప్రత్యేక పూజలు చేశారు. కాశీవిశ్వేశ్వర ఆలయంలో రాత్రి సమయంలో వేద పండితులు స్వామి వారి కల్యాణోత్సవంను కన్నులపండువగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



కలుగోడులో శివమాలధారుల ఊరేగింపు

గుమ్మఘట్ట: మండలంలోని కలుగోడు గ్రామంలో శివమాలధారులు ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. దాదాపు 30 మంది శివమాలధారులు స్థానిక శివాలయంలో ప్రత్యేకపూజలు జరిపి ఇరుముడి కట్టుకున్నారు. అనంతరం ఊరేగింపు చేసి శ్రీశైలానికి బయలుదేరారు.

## మహాశివరాత్రికి ముమ్మర ఏర్పాట్లు



బెళుగుప్పలోని రామలింగేశ్వరాలయం వద్ద ఏర్పాట్లు

బెళుగుప్ప, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంతో పాటు శీర్పి, ఎర్రగుడి, తగ్గుపర్తి తదితర గ్రామాల్లోని శివాలయాల్లో మహాశివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు పెద్దఎత్తున ప్రారంభమయ్యాయి. భక్తులు పెద్దఎత్తున తరలిరానుండడంతో నిర్వాహకులు అందుకు తగ్గ ఏర్పాట్లను మొదలుపెట్టారు. షామియానాలు, బారికేడ్లు, తాగునీరు, ప్రసాదం పంపిణీ తదితర వాటిని ఏర్పాటు చేస్తున్నారు. ఇక ఆలయాలను రంగులతో, విద్యుత్‌దీపాల అలంకరణలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. బెళుగుప్ప రామేశ్వరాలయంలో మరకత శివలింగం దర్శనానికి భక్తులు భారీ ఎత్తున రానున్నారు. ఈ ఆలయంలో శివపార్వతు ల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహణాధికారి అక్కిరెడ్డి తెలిపారు.

ఉరవకొండ: నియోజకవర్గంలోని జరుట్ల రామలింగేశ్వర స్వామి ఆలయం, పెద్దముష్టూరులోని సిద్ధేశ్వర స్వామి ఆలయాల్లో శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. అందుకు నిర్వాహకులు ఏర్పాట్లను పెద్దఎత్తున చేపడుతున్నారు.

### మొక్కజొన్న పంట దగ్ధం

అనంతపురం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కంబదూరు మండలం ఎర్రబండ గ్రామంలో ఎరుకుల కిష్టప్పకు చెందిన మూడు ఎకరాల్లో మొక్కజొన్న పంట సోమవారం దగ్ధమైంది. ఆ పొలానికి సమీపంలో ఒక చిన్న గుట్టలోని ఎండు గడ్డికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో మంటలు చెలరేగి మొక్కజొన్న పంటకు వ్యాపించాయి. దీంతో పంటంతా అగ్నికి ఆహుతైందని బాధిత రైతు వాపోయాడు. పంటతో పాటు వ్యవసాయ సామగ్రి కూడా కాలిపోయిందని అన్నాడు. దీంతో సుమారుగా రూ. 2.50 లక్షల మేర నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

### మోసం చేసిన మహిళపై ఫిర్యాదు

గుత్తి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సూరసింగనపల్లిలో చీటీల పేరుతో మోసం చేసిన అంజలి అనే మహిళపై సోమవారం బాధితులు టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణతో కలిసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సూరసింగనపల్లి కాలనీలో దాదాపు 100 మంది అంజలి వద్ద చీటీలు వేశారు. అయితే ఆమె ఎవరికీ చెల్లింపులు చేయకుండా ఇటీవల రాత్రికిరాత్రే భర్తతో కలిసి ఉడాయించింది. రూ.3కోట్ల దాకా మోసం చేసిందని, ఆమెపై కేసు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని బాధితులు సీఐ వెంకటేశ్వర్లును కోరారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఎవరైనా అనాధికారకంగా చీటీలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. టీడీపీ పట్టణ, మండల కన్వీనర్లు ఎంకే చౌదరి, బద్రీవలి, న్యాయవాది సోమశేఖర్, నాయకులు. బాధితులు పాల్గొన్నారు.

### టీడీపీ నాయకుడి మృతికి నివాళి

పామిడి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కట్టకిందపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పెరమసాని పెద్దిరెడ్డి సోమవారం హఠాన్మరణం చెందారు. విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుడి భార్య పెరమసాని లక్ష్మీదేవి, కుమారుడు రామాంజనేయులు యాదవ్‌ను పరామర్శించారు.

### ఘనంగా పెద్దమ్మ ఆలయ కలశ స్థాపన



కలశానికి మొక్కుతున్న జేసీపీఆర్

తాడిపత్రి, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పుట్లూరు రోడ్డులో ఉన్న పెద్దమ్మ అమ్మవారి ఆలయ కలశస్థాపనను సోమవారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు తొలుత అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ కలశస్థాపన నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

**పెద్దమ్మతల్లిని దర్శించుకున్న మున్సిపల్ చైర్మన్**

పెద్దమ్మతల్లిని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేకపూజలు జరిపించారు. అనంతరం జరిగిన కలశస్థాపన వేడుకల్లో పాల్గొన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, జగదీశ్వరరెడ్డి, జయచంద్రారెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

### నరమృగ వాహనంపై బుగ్గ రామలింగేశ్వరుడు



నరమృగ వాహనంపై కొలువుదీరిన స్వామివారు

తాడిపత్రి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారు నరమృగవాహనంపై విహరించారు. ఈ సందర్భంగా అర్చకులు వేకువజామునే శివలింగాని కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తికి విశేష అలంకరణ చేసి నరమృగవాహనంపై ఉంచి పట్టణ పురవీధుల్లో మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

### ఘనంగా ఏకాదశి పూజలు



ప్రత్యేక అలంకరణలో విఠోబస్వామి

పామిడి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రంగసుభే ఫిర్కా భగవాన్ దాస్ విఠోబస్వామి ఆలయం లో ఏకాదశి పూజలు సోమవారం ఘ నంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు వేకువజామున రుక్మిణి సమేతంగా విఠోబస్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు, అలంకరణలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భావసార క్షత్రియ భజన మండలి వారు దిండి భజనలు చేపట్టారు. ప్రాకారోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

### పాఠశాలల తనిఖీ

శెట్టూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలతో పాటు కేజీబీవీని జేసీడీవో వాణిదేవి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి అక్కడి సమస్యలనడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

### భక్తిశ్రద్ధలతో సరస్వతి పూజ

బ్రహ్మసముద్రం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండిగానిపల్లి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్లో చదువుల తల్లి సరస్వతీదేవి పూజను పదవ తరగతి విద్యార్థులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీదేవి చిత్రపటాన్ని అలంకరించి పూజలు చేశారు. తర్వాత విద్యార్థులకు దాతలు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. భైరవానితిప్ప సర్పంచ్ పోలేపల్లి శెట్టి తదితరులు పాల్గొన్నారు.

### బాలికలకు స్వీయరక్షణపై అవగాహన

యాడికి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఆదర్శపాఠశాల, కేజీబీవీ, ఉన్నత పాఠశాలల్లో బాలికలకు సోమవారం ఐసీడీఎస్ తాడిపత్రి సీడీపీఓ సాజిదాబేగం స్వీయరక్షణ నైపుణ్యాలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికలు, మహిళలపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో స్వీయరక్షణ నైపుణ్యాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. తర్వాత సమగ్ర స్వీయరక్షణపై బాలికలకు మెళకువలు నేర్పించారు. కేజీబీవీ ఎస్ఓ నిర్మల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయకుమారి, బేగం పాల్గొన్నారు.

### అర్హులందరికీ పీఎం కిసాన్: ఏఓ

యాడికి/పుట్లూరు ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి రైతుకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ఖాతాల్లో జమ అవుతుందని ఏఓ మహబూబ్‌బాషా తెలిపారు. పీఎం కిసాన్ 19వ విడత నిధులను ప్రధాని మోదీ సోమవారం బీహార్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని అన్ని రైతు సేవా కేంద్రాల్లో రైతులు వీక్షించే విధంగా దూరదర్శన్ ద్వారా టీవీల్లో ప్రసారం చేశారు. రైతులు హాజరై ప్రధాని ప్రసంగాన్ని విన్నారు. పీఎం కిసాన్‌కు సంబంధించి మండలంలో 7811మంది రైతులు అర్హులుగా ఉన్నారని ఏఓ తెలిపారు. వీరికి ఒక్కొక్కరికి రూ.2వేలు చొప్పున కోటి 56లక్షల 22వేల రూపాయలు మంజూరైందన్నారు. అర్హులై ఉండి ఎవరికైనా జమకాకపోతే సంబంధిత రైతుసేవా కేంద్రంలో సంప్రదించాలని ఆయన సూచించారు. అలాగే పుట్లూరు మండలంలోని 8528మంది రైతులకు రూ.1.71కోట్ల మేర పీఎం కిసాన్ 19వ విడతలో లబ్ధి చేకూరిందని ఏఓ కాత్యాయిని తెలిపారు.